ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 93, పేజీలు - 08
శుక్రవారం,అక్టోబర్ 02, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






## తెలంగాణ టార్గెట్‌గా బీజేపీ

### - అమిత్ షా ఎంట్రీ

- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాలు - అక్టోబర్ 4న కరీంనగర్, మెదక్ జిల్లాల్లో పర్యటన
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణను కేంద్రంగా చేసుకుని బీజేపీ కీలక రాజకీయ వ్యూహాలకు పదును పెడుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పార్టీ కార్యాచరణను విస్తృతం చేస్తోంది. ఇప్పటికే పలువురు కేంద్ర మంత్రులు తెలంగాణలో వరుసగా పర్యటిస్తుండగా గ్రేటర్ హైదరాబాద్, ఖైరతాబాద్ ఉప ఎన్నికలతో పాటు రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే దిశగా బీజేపీ అగ్రనాయకత్వం అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.అక్టోబర్ 4న అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారు. కరీంనగర్, మెదక్ జిల్లాల్లో ఆయన పర్యటన కొనసాగనుంది. కరీంనగర్‌లోని ప్రతిమ కాలేజీలో జరిగే కార్యక్రమంలో అమిత్ షా పాల్గొననున్నారు. ఈ పర్యటన కేవలం అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలకు కీలకంగా మారనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ఫోకస్

తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను లక్ష్యంగా చేసుకుని బీజేపీ తన కార్యాచరణను సిద్ధం చేస్తోంది. పార్టీ నేతలకు అగ్రనాయకత్వం ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. కేంద్ర మంత్రులు తరచూ తెలంగాణలో పర్యటిస్తూ ప్రత్యేకంగా తటస్థ వర్గాలతో మమేకం కావాలని పార్టీ ఆదేశించింది. తెలంగాణలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఢిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజా వ్యతిరేకతను పార్టీకి అనుకూలంగా మలుచుకునేందుకు 'సడక్ సే సదన్ తక్' కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

### క్యాడర్‌లో జోష్ నింపేలా..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడమే అమిత్ షా పర్యటన ప్రధాన లక్ష్యంగా ఉండనుందని పార్టీ నేతలు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను మరింత చురుగ్గా పనిచేసేలా చేయడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఇప్పటికే బీజేపీ అగ్రనాయకత్వం రాష్ట్ర పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసింది. ఈ క్రమంలో అమిత్ షా పర్యటనతో పార్టీ కార్యాచరణ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో అమిత్ షా తెలంగాణ పర్యటనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## ముంబై పోరుకు సిద్ధమైన కాక్రోచ్‌లు!

### - సీఈసీ రాజీనామాపై తాడోపేడో



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఎన్నికల నిర్వహణ, ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడటం ద్వారా అధికార బీజేపీకి ప్రయోజనం చేకూరుస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ లు ముంబైలో నిరసనకు సిద్ధమయ్యారు. నేడు సాయంత్రం 4 గంటలకు శివాజీ పార్క్ వద్ద జైల్ భరో పేరుతో భారీ కార్యక్రమం చేపట్టబోతున్నారు. సీఈసీని వెంటనే తప్పించి, అరెస్టు చేయాలని కాక్రోచ్ లు డిమాండ్ చేస్తున్నారు. దీంతో మహా సర్కార్ ఈ నిరసనను అడ్డుకునేందుకు సిద్ధమవుతోంది.మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, 3 డిమాండ్లను ముందుకు తెస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజీత్ దిప్కే వెల్లడించారు. ఇందులో మొదటిది జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి, క్రిమినల్ విచారణను ఎదుర్కోవాలి, ఆదేశాలు

2లో..

## ఉద్యోగులు, పెన్షనర్లకు
## 2 డీఏలు మంజూరు

- ఎల్నినో పరిస్థితులపై సుదీర్ఘ చర్చ
- విద్యుత్ కోత లేకుండా సరఫరాకు నిర్ణయం
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకులతో ఇటీవల జరిపిన చర్చల అనంతరం ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఉద్యోగులకు, పింఛనుదారులకు నిలిచిపోయిన పెండింగ్ కరువు భత్యాల్లో రెండు విడతల డీఏల విడుదలకు కేబినెట్ అధికారిక ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు,

2లో..

## హిందూ దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు

### - సీఎం రేవంత్ వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నాయకుడు జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ పొత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామని, అయితే ఈసారి బీజేపీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

2లో..

## బీసీ రిజర్వేషన్లకు గొడ్డలి పార్టీయే అడ్డంకి

### - సుప్రీంకోర్టుకు వెళ్తామని చంద్రబాబు ప్రకటన

- గత ప్రభుత్వంపై రేపల్లె సభలో చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వెంటిలేటర్‌పై పెడితే, తాము ఆక్సిజన్ అందించి కాపాడామన్న సీఎం
- అమరావతిని ఎడారి, శ్మశానం అన్నారని.. పోలవరాన్ని గోదావరిలో ముంచేశారని ఫైర్



అమరావతి (ప్రశ్న న్యూస్) గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తెలుగుదేశం పార్టీ 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, గత 'గొడ్డలి పార్టీ' ప్రభుత్వం దాన్ని 24 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. "దీనివల్ల దాదాపు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారు. మేము మళ్లీ 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తే, వాళ్లే కోర్టుకు వెళ్లి అడ్డుపడ్డారు. బీసీలపై ద్వేషంతోనే ఈ కుట్ర చేస్తున్నారు. అయినా మేం వెనకడుగు వేయం. రేపే సుప్రీంకోర్టుకు వెళుతున్నాం. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాడతాం" అని ఆయన స్పష్టం చేశారు.
గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "అప్పులు దొరక్కపోతే రాష్ట్ర ఆస్తులను తాకట్టు పెట్టారు. కనీసం మద్యపాన నిషేధం హామీని నిలబెట్టుకోకుండా, భవిష్యత్తులో 25 ఏళ్లపాటు మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన దారుణమైన పరిస్థితిని సృష్టించారు. మేం అధికారంలోకి వచ్చాక ఆ అప్పుల వడ్డీ రేట్లను తగ్గించి, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం" అని వివరించారు. ముఖ్యమంత్రి అంటే సెక్రటేరియట్‌లో కూర్చోవడం కాదని, సామాన్యుడిలా ప్రజల మధ్య ఉంటూ వారి కష్టాలు తీర్చడమే

2లో..

## నెల రోజుల్లో డీఎస్సీ 2.0

### - అధికారులకు మంత్రి లోకేశ్ కీలక ఆదేశాలు

- పదో తరగతి ఫలితాల కోసం 'మిషన్ మార్చ్' పకడ్బందీగా అమలు
- యూనివర్సిటీల్లో 1523 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు
- స్కూల్ డ్రాపౌట్ల నివారణకు 'జీరో డ్రాప్ అవుట్ మిషన్'



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నెల రోజుల్లోపు డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి పోస్టింగ్ ఉత్తర్వుల జారీ వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. ఏపీ రిక్రూట్‌మెంట్ మోడల్‌ను దేశం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని, ఇతర రాష్ట్రాలు మన విధానాలను అనుసరించేలా సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు.

2లో..

## 'సర్'లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు

- 65 లక్షల మంది నోటీసులకు సమాధానం ఇచ్చారని వెల్లడి
- సర్ ప్రక్రియను పొడిగించే ఉద్దేశం లేదని స్పష్టీకరణ




2లో..

## భూమికి పెరుగుతున్న ముప్పు

### - 9 పరిమితుల్లో 7 ప్రమాదకర స్థాయికి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భూమి మనుషుల నివాసానికి అనుకూలంగా ఉండే సురక్షిత పరిమితులను వేగంగా దాటుతోంది. భూమిని నిలకడగా ఉంచే 9 కీలక వ్యవస్థల్లో ఏకంగా 7 వ్యవస్థలు ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటినట్లు తాజా శాస్త్రీయ అధ్యయనం వెల్లడించింది. 60 మందికి పైగా శాస్త్రవేత్తలు నిర్వహించిన 2026 ప్లానెటరీ హెల్త్ చెక్‌లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వాతావరణ మార్పులు, జీవ వైవిధ్యానికి నష్టం, భూ వినియోగంలో మార్పులు, మంచినీటి వ్యవస్థల్లో మార్పులు, నైట్రోజన్-ఫాస్ఫరస్ వంటి రసాయన చక్రాల్లో అసమతుల్యత, ప్లాస్టిక్-సింథటిక్ రసాయనాల కాలుష్యం, సముద్రాల ఆమ్లీకరణ.. ఈ ఏడు అంశాల్లో భూమి సురక్షిత పరిమితులను దాటింది. గత అంచనాలతో పోలిస్తే సముద్రాల ఆమ్లీకరణ కూడా తొలిసారి ఈ జాబితాలో

2లో..

## ఖైరతాబాద్ సమరానికి బ్రేక్.?

- హైకోర్టులో ఈసీ కీలక వ్యాఖ్యలు
- ఇప్పట్లో నోటిఫికేషన్ లేనట్లే!?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడటంతో ఖాళీ అయిన ఈ స్థానానికి త్వరలోనే ఉపఎన్నిక శంఖారావం మోగుతుందని ఆశావహులు సన్నద్ధమవుతున్న వేళ, కాంగ్రెస్ నాయకురాలు, దివంగత నేత పీజేఆర్ కుమార్తె పి. విజయారెడ్డి వేసిన లీగల్ పిటిషన్ ఎన్నికల ప్రక్రియను ఒక్కసారిగా బ్రేక్ వేసింది. ఈ వివాదం తేలేవరకు ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేయవద్దంటూ ఎన్నికల సంఘానికి స్పష్టత రావడంతో నియోజకవర్గ సమరం చట్టపరమైన చిక్కుల్లో పడింది. అసలు ఈ న్యాయపోరాటానికి పునాది 2023 సాధారణ ఎన్నికలలోనే పడింది. నాటి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ విజయం సాధించగా, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన విజయారెడ్డి ఓటమి పాలయ్యారు. అయితే ఎన్నికల అఫిడవిట్ ఫారం-26 లో దానం నాగేందర్ తన కుటుంబ ఆస్తుల వివరాలను

2లో..

## ఆస్తులపై విచారణకు సిద్ధమా.?

### - సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!

- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరిన కేటీఆర్
- తప్పు తేలితే శిక్షకు సిద్ధమన్న కేటీఆర్
- నా హోటళ్లకు ఫ్రీ పబ్లిసిటీ ఇచ్చిన రేవంత్‌కు థ్యాంక్స్
- ప్రభుత్వ హామీలపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సిరిసిల్ల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేసీఆర్, ఆయన కుటుంబం ఆస్తులపై చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. ముఖ్యంగా తన కుటుంబ ఆస్తులు, వ్యాపారాలపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రెండు కుటుంబాల ఆస్తులపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు సిద్ధమా అంటూ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తుల్లో ఏదైనా తప్పు ఉన్నట్లు విచారణలో తేలితే చట్ట ప్రకారం ఎలాంటి శిక్షకైనా తాము సిద్ధమని కేటీఆర్ చెప్పారు. అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపై కూడా అదే తరహాలో విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇరు కుటుంబాల ఆస్తులను పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి విచారణకు సీఎం అంగీకరిస్తే తాము పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. ఇదే డిమాండ్‌ను కేటీఆర్ గతంలోనూ బహిరంగంగా ప్రస్తావించారు.

2లో..

# ముంబై పోరుకు సిద్ధమైన కాక్రోచ్‌లు!

ఎవరు ఇచ్చారో వెల్లడించాలి. అలాగే రెండవది ఎస్ఐఆర్ (సర్) ను నిలిపివేయాలి, జనవరి 2025 ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలి, స్వతంత్ర విచారణకు ఆదేశించాలి. మూడో డిమాండ్ 2023 ఎన్నికల కమిషనర్ల నియామకాల చట్టాన్ని రద్దు చేసి, పౌర సమాజ భాగస్వామ్యంతో పారదర్శక చట్టాన్ని తీసుకురావాలి.వారు తమకు నచ్చిన వారిని కేవలం నిర్ణయించి ఎన్నికల కమిషనర్‌గా నియమించలేరని కేంద్రాన్ని ఉద్దేశించి అభిజీత్ దిప్కే పేర్కొన్నారు. ఈ పదవిలో ఎవరు ఉంటారనే దానిపై 150 కోట్ల మంది జీవితాలు ప్రత్యక్షంగా ప్రభావితమవుతాయన్నారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా ఉండాలని దిప్కే కోరారు. ఎస్ఐఆర్ కు ముందే, ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఎస్ఐఆర్ జాబితా ప్రకారం ఎన్నికలు జరిగితే, ప్రధాని మోదీ అమెరికాలో కూడా గెలవగలరని దిప్కే ఎద్దేవా చేశారు. మరోవైపు శివాజీ పార్క్ వద్ద రేపటి కాక్రోచ్ ల ఆందోళనలకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. స్థానికుల ఆందోళనలను ఇందుకు సాకుగా చూపింది. దీనిపై స్పందించిన దిప్కే తాము ఎట్టి పరిస్థితుల్లో జైల్ భరోకు దిగుతామని, చేతనైతే అడ్డుకోవాలని సవాల్ విసిరారు.

# బీసీ రిజర్వేషన్లకు గొడ్డలి పార్టీయే అడ్డంకి

తన బాధ్యత అని స్పష్టం చేశారు.

### అమరావతి జోలికెళితే మసైపోతారు!

రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నాశనం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. "సైబరాబాద్‌ను నిర్మించిన అనుభవంతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనుకుంటే, అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ నాటకాలకు తెరలేపారు. అమరావతిని ఎడారి, శ్మశానం అంటూ సర్వనాశనం చేశారు. కానీ రైతుల త్యాగాలు, ముక్కోటి దేవతల ఆశీస్సులతో అమరావతి నిలబడింది. ఇకపై అమరావతిని ఒక్క ఇంచు కూడా ఎవరూ కదిలించలేరు. ఆ ప్రయత్నం చేస్తే మసి అయిపోతారు" అని తీవ్రంగా హెచ్చరించారు. అదేవిధంగా, పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను గోదావరిలో ముంచేశారని, తాము మళ్లీ దాన్ని బాగుచేసి వచ్చే ఏడాది మార్చి నాటికి ఫేజ్-1 పూర్తి చేసి కృష్ణా నదికి నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.ప్రతిపక్షంలో నిర్మాణాత్మక పోటీతత్వం ఉండాలి గానీ, గత ప్రభుత్వంలో కుట్రతత్వం మాత్రమే ఉందని చంద్రబాబు విమర్శించారు. "మేం పరిశ్రమలు తెస్తే, వాళ్లు పారిశ్రామికవేత్తలను తరిమికొట్టారు. ఇప్పుడు మళ్లీ పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. వ్యాన్‌పిక్ వంటి ప్రాజెక్టులను అవినీతితో నాశనం చేసి, ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకున్నారు. ఇప్పుడు సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నారు. మేం రోడ్లు వేస్తే వాళ్లు గుంతలు తవ్వారు. పట్టాదారు పాసుపుస్తకాలపై, సర్వే రాళ్లపై కూడా వాళ్ల బొమ్మలు వేసుకొని రూ.800 కోట్లు దుర్వినియోగం చేశారు" అని ఆరోపించారు. వీటన్నింటినీ సరిచేసి, భూ సమస్యలకు బ్లాక్‌చైన్ టెక్నాలజీతో శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు.

### పాలనలో మార్పులు, అభివృద్ధి మంత్రం

తాము కేవలం బటన్ నొక్కి డబ్బులు పంచే ప్రభుత్వం కాదని, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శి కుటుంబాలు, బంగారు కుటుంబాల పేరిట ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. 'ఆరోగ్యం, ఆదాయం, ఆనందం' అనే మూడు సూత్రాలతో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాన్ని ప్రజల భాగస్వామ్యంతో సాధిస్తామని చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు.

### మోదీ, పవన్‌తో కలిసే హామీ ఇచ్చాం!

2024 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి ప్రజల వద్దకు వచ్చామని, రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తుచేశారు. ఆ నమ్మకంతోనే ప్రజలు కూటమికి 54% ఓట్లు, 94% సీట్లతో చారిత్రక విజయాన్ని అందించారని అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని తాము బాధ్యతగా స్వీకరించామని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ ప్రజలకు సేవకులే తప్ప పెత్తందారులు కాదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. రైల్వే స్టేషన్‌లో టీ అమ్మిన ఒక సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తి, తన సమర్థతతో దేశ ప్రధాని స్థాయికి ఎదిగారని కొనియాడారు. ప్రజాస్వామ్యంలో ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా మోదీ నిలిచారని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎన్నో విజయాలు సాధిస్తోందని, ఆ అవకాశాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. 2024లో లభించిన చారిత్రక తీర్పు వెనుక ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో ఉన్న మైత్రి కీలక పాత్ర పోషించిందని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# హిందూ దేవుళ్లపై మాట్లాడితే ప్రజల మద్దతు రాదు

రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు కేటాయింపులపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, సింగరేణి బొగ్గును వినియోగించుకునేలా ఈ ప్లాంట్‌కు ఎందుకు రూపకల్పన చేయలేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని కిషన్ రెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. రాహుల్ గాంధీ రాజ్యాంగబద్ధమైన సంస్థలపై, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌పై అనుచిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మార్పు అనేది ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందే తప్ప, రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. శివుడు, రాముడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని, వాటిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘంపై, బీజేపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతాల వారీగా ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని, తొలగించిన ఓట్లను (మరణించిన వారు, అక్రమ చొరబాటుదారులు) తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుపు తథ్యమని, తమ పార్టీ ఓట్లను దొంగిలించదని, కేవలం ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు 2 డీఏలు మంజూరు

ఉపాధ్యాయులు, రిటైర్డ్ పెన్షనర్లకు వేతనాల పరంగా పెద్ద ఊరట లభించనుంది.కేబినెట్ నిర్ణయాల ప్రకారం ఉద్యోగులకు 3.64 శాతం, 2.74 శాతం చొప్పున మొత్తం రెండు డీఏలను మంజూరు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా ఒక డీఏను త్వరలోనే రాబోయే జీతాలతో కలిపి పంపిణీ చేయనుండగా, మరో డీఏను రాబోయే పండుగలు, తదుపరి షెడ్యూల్ ప్రకారం విడుదల చేయనున్నారు. అంతేకాకుండా, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సుమారు రూ. 10,000 కోట్ల పాత జీపీఎఫ్, గ్రాట్యుటీ, మెడికల్ బిల్లుల బకాయిలను ప్రతి నెలా క్రమం తప్పకుండా విడుదల చేస్తూ రాబోయే కాలంలో పూర్తిగా చెల్లించేలా బడ్జెట్ కేటాయింపులపై స్పష్టమైన కార్యాచరణకు అంగీకారం తెలిపింది.డీఏల విడుదలతో పాటు పే రివిజన్ కమిషన్ నివేదిక అమలుపై కూడా కేబినెట్ భేటీలో విస్తృతంగా చర్చించారు. పీఆర్సీ కమిటీ అందించే తుది నివేదికను పరిశీలించి, వీలైనంత త్వరగా కొత్త వేతన సవరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగ సంఘాల విన్నపాలను సానుకూలంగా పరిశీలించి ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వం వెల్లడించింది. కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఉద్యోగుల అంశాలతో పాటు రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా సంస్కరణలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది.

రాష్ట్రంలో ధరణి పోర్టల్ స్థానంలో తీసుకురానున్న కొత్త భూపరిపాలన వ్యవస్థ, నిషేధిత భూముల జాబితా సమీక్ష , రైతులకు సంబంధించిన పలు సంక్షేమ పథకాల అమలుపై సభలో చర్చ జరిగింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు సంబంధించి వివిధ నిధుల మంజూరుకు మంత్రివర్గం అమోదముద్ర వేసింది.గురువారం నాటి కేబినెట్ సమావేశం బహుళ ప్రాధాన్యత కలిగిన నిర్ణయాలతో ముగిసింది. దసరా, దీపావళి పండుగల వేళ విడుదలైన రెండు డీఏల నిర్ణయం ప్రభుత్వ ఉద్యోగ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ నిర్ణయానికి సంబంధించిన పూర్తి వివరాలు, చెల్లింపుల షెడ్యూల్ , అర్హతలతో కూడిన అధికారిక జీవోలు ఆర్థిక శాఖ ద్వారా త్వరలోనే వెలువడనున్నాయి. ఎల్ నినోను ఎదుర్కోవడంపై కేబినెట్ లో చర్చించారు. సబ్ కమిటీని నియమించనున్నారు. కేంద్రాన్ని సాయం అడగాలని నిర్ణయించారు.

# నెల రోజుల్లో డీఎస్సీ 2.0

పాఠశాల విద్యలో కీలక సంస్కరణలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. బడి మానేసే పిల్లల సమస్యపై సింగపూర్ హోంమంత్రి షణ్ముగం చేసిన సూచనలను ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో 'జీరో డ్రాప్ అవుట్ మిషన్' చేపట్టాలని సూచించారు. డ్రాపౌట్ల నివారణలో సమాజంలోని పెద్దలను, స్థానిక ప్రముఖులను భాగస్వాములను చేయాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.ఉన్నత విద్యారంగంపై కూడా సమీక్షించిన లోకేశ్, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిందని, డిసెంబరులో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రాత పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. రాష్ట్రంలో పలు ప్రతిష్ఠాత్మక ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని, వాటికి అవసరమైన భూమిని గుర్తించాలని మంత్రి సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో విశాఖపట్నంలో పబ్లిక్ లైబ్రరీ భాగస్వామ్యంతో ఒక ప్రతిష్ఠాత్మక గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 125 ఆటిజం సెంటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఖైరతాబాద్ సమరానికి బ్రేక్.?

సమగ్రంగా వెల్లడించకుండా దాచిపెట్టారంటూ విజయారెడ్డి 2024లోనే తెలంగాణ హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఆయన పదవి ఊడటంతో కొత్తగా ఉపఎన్నిక నిర్వహించే కంటే, పాత పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుని తననే విజేతగా ప్రకటించే అవకాశాలు సైతం చట్టపరంగా ఉన్నందున పిటిషన్ తేలేవరకు ఉపఎన్నిక ప్రక్రియను నిలిపివేయాలని ఆమె తాజాగా కోర్టు తలుపులు తట్టారు.పార్టీ మారిన దానం నాగేందర్‌ను కాంగ్రెస్ తరఫున ఉపఎన్నిక బరిలో నిలపాలని అధిష్ఠానం భావిస్తున్న వేళ, అదే పార్టీకి చెందిన విజయారెడ్డి లీగల్ అస్త్రం విసరడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. దీనితో రాబోయే రోజుల్లో న్యాయస్థానం ఎలాంటి తీర్పు ఇస్తుందనేది అత్యంత కీలకంగా మారింది. ఒకవేళ హైకోర్టు విజయారెడ్డి దాఖలు చేసిన పాత ఎన్నికల పిటిషన్‌ను వేగవంతంగా విచారించి దానం ఎన్నిక చెల్లదని తేలిస్తే, అక్కడ ఉపఎన్నిక అవసరం లేకుండానే రెండో స్థానంలో ఉన్న విజయారెడ్డికి ఎమ్మెల్యేగా అవకాశం దక్కే లీగల్ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదే జరిగితే ఖైరతాబాద్‌లో పీజేఆర్ వారసత్వ రాజకీయం మరోసారి బలపడే అవకాశం ఉంది.ఈ లీగల్ ట్విస్ట్‌తో ఖైరతాబాద్ ఉపఎన్నిక రేసులోని ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కొత్తగా బరిలోకి దిగుతామన్న కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సేన తమ ప్రచార వేగానికి తాత్కాలికంగా బ్రేకులు వేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. సాధారణ నిబంధనల ప్రకారం ఆరు నెలల గడువు ఉన్నప్పటికీ, కోర్టు పరిధిలోని ఈ ఎలక్షన్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు వెలువరించే తుది ఆదేశాలపైనే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి భవిష్యత్ ఎన్నికల ముహూర్తం పూర్తిగా ఆధారపడి ఉంది.

# ఆస్తులపై విచారణకు సిద్ధమా.?

సిరిసిల్లలో తన హోటళ్ల గురించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రస్తావనపై కేటీఆర్ స్పందిస్తూ "నా హోటళ్లకు రేవంత్‌రెడ్డి ఉచితంగా ప్రచారం ఇచ్చారు. అందుకు హృదయపూర్వక ధన్యవాదాలు" అంటూ ఎద్దేవా చేశారు. తాను అమెరికాలో 6 ఏళ్ల పాటు ఉద్యోగం చేశానని అక్కడ సంపాదించిన డబ్బుతో ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించినట్లు కేటీఆర్ చెప్పారు. అప్పట్లో ఒక హోటల్ ఉండగా ప్రస్తుతం 3 హోటళ్లుగా విస్తరించాయని పేర్కొన్నారు. తన వ్యాపార వివరాలను 2009 ఎన్నికల అఫిడవిట్లలోనే వెల్లడించానని కేటీఆర్ స్పష్టం చేశారు. రాజకీయాల్లోకి రాకపోయి ఉంటే ఆ హోటళ్లను 10 చేసే వాడిని అని వ్యాఖ్యానించారు. వ్యాపారం చేయడంలో తప్పేముందని కేటీఆర్ ప్రశ్నించారు. తమ కుటుంబ ఆస్తులు, రేవంత్ రెడ్డి కుటుంబ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా అని కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. విచారణలో తమ కుటుంబం తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా భారీగా పోలీసులను మోహరించడంపైనా కేటీఆర్ విమర్శలు చేశారు. ప్రతిపక్ష నేతలపై రాజకీయ విమర్శలు చేయడానికి ఇంత భారీ స్థాయిలో పోలీసు బందోబస్తు ఎందుకని ప్రశ్నించారు. సిరిసిల్ల పర్యటనలో చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సమస్యలపై సీఎం మాట్లాడాల్సి ఉండగా ప్రధానంగా రాజకీయ ఆరోపణలకే పరిమితమయ్యారని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేనేత కార్మికుల పరిస్థితిపై తాము ప్రశ్నలు లేవనెత్తుతున్నామని ముఖ్యంగా ఆత్మహత్యలు చేసుకున్న కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరుతున్నామని చెప్పారు. ఈ అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే తమ కుటుంబ ఆస్తుల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

# భూమికి పెరుగుతున్న ముప్పు

చేరింది.మిగిలిన రెండు వ్యవస్థల్లో స్ట్రాటోస్ఫియరిక్ ఓజోన్ పొర పరిస్థితి మెరుగుపడినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే వాతావరణంలో ఉండే సూక్ష్మ కాలుష్య కణాలు కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ తీవ్ర సమస్యగా ఉన్నాయి. 2009లో శాస్త్రవేత్తలు 'ప్లానెటరీ బౌండరీస్' విధానాన్ని రూపొందించారు. మానవాళి సురక్షితంగా జీవించగలిగే భూమి పరిమితులను గుర్తించడం దీని ఉద్దేశం. ఈ పరిమితులను దాటడం అంటే వెంటనే విపత్తు వస్తుందని కాదు. కానీ, తిరిగి వాటిని పునరుద్ధరించడం కష్టంగా మారి దీర్ఘకాలంలో ముప్పుగా మారుతుందని అర్థం. అమెజాన్ అడవుల పరిస్థితిపైనా శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. భారీగా కార్బన్‌ను నిల్వ చేసే ఈ అడవులపై ఒత్తిడి పెరుగుతుండటంతో భవిష్యత్తులో కీలక మార్పులు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. దాని ప్రభావం వాతావరణ స్థిరత్వం, ఆహారం, నీటి భద్రతపై పడొచ్చని పేర్కొన్నారు. అయితే పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోలేదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను వేగంగా తగ్గించడం, అడవులు, సముద్రాలు, మంచినీటి వ్యవస్థలను రక్షించడం ద్వారా భూమిని మళ్లీ సురక్షిత పరిమితులకు దగ్గర చేయవచ్చని నివేదిక తెలిపింది.

# 'సర్'లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా రాష్ట్రంలో 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చామని వెల్లడించారు. హైదరాబాద్ జగ్జీవన్‌రామ్ భవన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సర్కు సంబంధించిన అంశాలను సుదర్శన్ రెడ్డి వివరించారు. ఎన్నికల కమిషన్ సర్‌లో కొన్ని మార్పులు చేసిందన్నారు. సర్ ప్రక్రియ జరుగుతున్న రాష్ట్రాల్లో ఫామ్-6తో పాటు డిక్లరేషన్ తీసుకోవాలని ఈసీ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సర్ నోటీసులు అందిన వారి వద్దకే బీఎల్‌వోలు వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటారని సుదర్శన్ రెడ్డి తెలిపారు. నోటీసులు అందిన కుటుంబసభ్యులు అందరూ ఉండాల్సిన అవసరంలేదని, ఒకరు వివరాలు ఇస్తే సరిపోతుందని వివరించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈసీ ఈ మార్పులు చేసిందని చెప్పారు. మూడు లక్షల మందికి సంబంధించిన నోటీసులకు సమాధానాలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. నోటీసులకు 65 లక్షల మంది సమాధానం ఇచ్చినట్లు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఇంకా 54లక్షల మందిని తుది జాబితాలోకి తీసుకున్నామని నవంబర్ 5వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. బీఎల్‌వోలు ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ పార్టీలకు చెందినవారు కాదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశంలేదని ఆయన తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80వేల మంది ఓటర్లకు నోటీసులు వచ్చామని ఇప్పటి వరకు 20శాతం మంది నుంచి మాత్రమే సమాధానాలు వచ్చాయని వివరించారు.

# ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**పత్తికొండ** రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ అన్నారు.గురువారం పత్తికొండ నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నలకదొడ్డి గ్రామంలో సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి, అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని ఖ4 కార్యక్రమం ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకుని వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. అనంతరం పత్తికొండ పట్టణంలోని కుమ్మరి వీధిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు పట్టణంలోని అవసరమైన ప్రాంతాల్లో దశలవారీగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు.అలాగే పత్తికొండ ఎండీఓ కార్యాలయం వెనుక భాగంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

# నా సభ్యత్వం ఏమైంది.?

**2019లో లైఫ్ మెంబర్‌షిప్ తీసుకున్నా..**

**ఇప్పుడు సభ్యుల జాబితాలో పేరు లేదెందుకు?**

**72 సార్లు రక్తదానం చేసినా సమాజ సేవకు పనికిరానా?**

**సభ్యులకు సమాచారం లేకుండానే ఎన్నికలు ఎలా నిర్వహించారు.?**



భద్రాచలం(ప్రశ్న న్యూస్) భద్రాచలంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవహారాలపై ఓ లైఫ్ మెంబర్ పలు ప్రశ్నలు సంధించారు. 2019లో లైఫ్ మెంబర్‌షిప్ తీసుకున్న తన పేరు ప్రస్తుతం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుల జాబితాలో లేకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 72 సార్లు రక్తదానం చేయడంతో పాటు అనేక రక్తదాన శిబిరాలను నిర్వహించి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుకు రక్తం అందించిన తనలాంటి వ్యక్తి సభ్యత్వం ఎలా లేకుండా పోయిందని ప్రశ్నించారు.రెడ్‌క్రాస్ సంస్థలో గతంలో పలుమార్లు తనను సన్మానించిన సంఘటనలు ఉన్నాయని, అలాంటి తనకు ప్రస్తుతం సభ్యత్వం లేదని చెప్పడం వెనుక కారణమేంటని నిలదీశారు. తెలియని విద్యార్థుల పేర్లతో వందలాది మందిని సభ్యులుగా చేర్చారని ఆరోపిస్తూ, సమాజ సేవలో చురుకుగా పాల్గొనే వారిలో ఎంతమందిని సభ్యత్వం నుంచి తొలగించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు.అసలు సభ్యులకు తెలియకుండా ఎన్నికలు ఎలా నిర్వహించారు? అని ప్రశ్నించారు. ఏకగ్రీవంగా ఎన్నికలు నిర్వహించుకునే పరిస్థితి ఉన్నప్పుడు ఎన్నికల ప్రక్రియను ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందని నిలదీశారు. సంస్థలో మొత్తం సభ్యులు ఎంతమంది ఉన్నారు? వారిలో ఎంతమంది అధికారికంగా సభ్యులుగా ఉన్నారు? ఎంతమందిని వాట్సాప్ లేదా ఇతర గ్రూపుల్లో చేర్చారు? సభ్యులందరినీ గ్రూపుల్లో ఎందుకు చేర్చలేదు? ఎన్నికలపై ప్రతి సభ్యుడికి సమాచారం ఎందుకు అందించలేదు? అనే ప్రశ్నలను సంధించారు.సమాజ సేవ చేసే అవకాశం కొంతమందికే పరిమితం చేయడం సమంజసమేనా? సంస్థ కోసం సేవలందించిన ఇతరులను పక్కన పెట్టడం ఎందుకు? అని ప్రశ్నించారు. రెడ్‌క్రాస్ సొసైటీకి ఇప్పటివరకు వచ్చిన ఆదాయం, చేసిన ఖర్చులు, సంస్థ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను సభ్యులకు, ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదని నిలదీశారు.సమాజ సేవ పేరుతో నడుస్తున్న సంస్థలో పారదర్శకతకు ప్రాధాన్యత ఉండాలని, సభ్యత్వం, ఎన్నికలు, ఆదాయ వ్యయాలు వంటి అంశాలపై స్పష్టమైన సమాచారం అందించాలని ఆయన కోరారు. తనతో పాటు అనేకమంది సభ్యుల్లో ఇదే తరహా ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రశ్నలన్నింటికీ రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# అక్టోబర్ 7వ తేదీన బీజేపీ రాష్ట్ర సేవా జ్యోతి యాత్ర

**విజయవాడ** సేవా సంకల్ప అభియాన్ పేరుతో రాష్ట్రంలో ఆశీర్వాద్ దీపం లాంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించుకున్నాము అంఘన్వాడి ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించాము . రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీజేపీ ఛీఫ్ పివీఎన్ మాధవ్ అన్నారు.అక్టోబర్ 7వ తేదీన రాష్ట్ర సేవా జ్యోతి యాత్ర చేయబోతున్నాము.. ప్రతి ఊరిలో ప్రజలతో మమేకమవుతు ఈ యాత్ర జరుగుతుంది. తీర ప్రాంతాలలో సాండ్ ఆర్ట్ కార్యక్రమంతో ముగ్గుల కార్యక్రమం చేస్తున్నాము. ఈ సేవా సంకల్ప యాత్ర లో గత 12 సంవత్సరాలలో దేశం ఏవిధంగా అభివృద్ధి చెందిందో ప్రజలందరికి తెలియచేయాలనే ఉద్దేశంతో ముందుకి వెళ్తున్నామని అన్నారు.విశాఖ లో రైల్వే జోన్, రహదారుల నిర్మాణం ,అమరావతి లో కేంద్ర సహాయ సహకారాలతో ఏవిధంగా నిర్మాణాలు జరుగుతున్నాయో తెలియచేయటం జరుగుతుంది అలాగే తిరుపతి లో ఐఐటీ, ఎయిమ్స్ నిర్మాణాలు, టూరిజం అభివృద్ధిలో కేంద్రం ద్వారా జరిగే కార్యక్రమాలని ప్రజలందరికి తెలియచేసేలా కార్యక్రమాలు ఉంటాయి. దేశంలో ఉన్న ప్రజలకే కాదు ప్రపంచ వ్యాప్తంగా అనేక అభివృద్ధి ని తెలియచేసేలా ముందుకి వెళ్తామని అన్నారు.ఓటు చోరీ పై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారం పై అమిత్ షా పార్లమెంట్ వేదికగా సమాధానం ఇచ్చారు . కాంగ్రెస్ హయాంలో ఏవిధంగా ఓటు చోరీ చేసిందో అమిత్ షా పార్లమెంట్ లో చెప్పడంతో రాహుల్ మౌనం వహించి వెనుతిరగటం జరిగిందని అన్నారు.

# అక్రమంగా కలప తరలిస్తే పట్టించుకోరా

**- సూది కొండ రేంజ్ పరిధిలో విచ్చలవిడిగా కలప తాటి పెట్టులు రవాణా**

**- కన్నెత్తి చూడని ఫారెస్టు శాఖ అధికారులు**







**గంగవరం** గంగవరం రంపచోడవరం అడ్డతీ గల పరిసరాల ఏజెన్సీ ప్రాంతం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా మైదాన ప్రాంతానికి తాటిపట్లు కలప రవాణా విచ్చలవిడిగా జరుగుతుంది. ఈ కలప రవాణాకు ఎటువంటి అనుమతులు లేవని సమాచారం. ఇంత కలప రవాణా మైదాన ప్రాంతానికి తరలి వెళ్ళిపోతున్న పోక్స్ పేట సూది కొండ రేంజ్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు విమర్శలు వస్తున్నాయి. పకృతి తాటి చెట్లతో పాటు విలువైన వివిధ రకాల కలప తరలి వెళ్ళిపోతుందని సమాచారం. ఈ కలప వ్యాపారం మొత్తం మైదాన ప్రాంతానికి సంబంధించిన వ్యాపారస్తులే తరలిస్తున్నారు. ఈ అక్రమ తరలింపులకు ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలకు సెమిఫైనల్స్ లాంటివే

**- సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి**



**మహబూబ్‌నగర్ :** రాష్ట్రంలో రెండు చోట్ల జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గానే భావిస్తున్నామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. హైద్రాబాద్, రంగారెడ్డి, పాలమూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యతగా వ్యవహరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. ఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల వారిలో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వెల్లడించారు. పట్టభద్రులు అందరూ తాజాగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. పార్టీ శ్రేణులు గ్రామ, గ్రామానా పట్టభద్రులను కలసి ఓటు నమోదు చేయించాలని కోరారు. 43నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుందని వెల్లడించారు. ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న దృష్ట్యా గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. అభ్యర్థి విషయంలో పార్టీ నిర్ణయం శిరోధార్యమని అన్నారు. ఎమ్మెల్సీ విజయంతో ప్రభుత్వానికి చెంప చెల్లుమనిపించేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# గురుకుల పాఠశాలలో జోనల్ ఆఫీసర్ అపర్ణ ఆకస్మిక తనిఖీ



**కారేపల్లి, అక్టోబర్ 01 :** కారేపల్లిలోని శ్రీ కవిత ఇంజినీరింగ్ కళాశాల భవన్ లో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలను భద్రాద్రి జోన్ జోనల్ అధికారి పి.అపర్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడిన ఆమె విద్య బోధన, వసతి, భోజనం, ఆరోగ్యం, మౌలిక సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నట్లు విద్యార్థినులు తెలిపారు. అనంతరం పరీక్షల నిర్వహణను పరిశీలించిన జోనల్ ఆఫీసర్ పరీక్షలు సక్రమంగా జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్, కిచెన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. క్యాంపస్ పరిసరాల్లో పెరిగిన గడ్డిని తొలగించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని నిరంతరం కల్పించాలని పేర్కొన్నారు.

# అనాథ వృద్ధులకు అమ్మలా మదర్ థెరిసా సేవా సంస్థ



**రుద్రంపూర్, అక్టోబర్ 01 :** వృద్ధాప్యంలో ఆదరణ కోల్పోయిన వారికి అండగా నిలవడం, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడడమే నిజమైన మానవత్వమని చాటుతూ రుద్రంపూర్‌లో మదర్ థెరిసా సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథలు, ఆదరణకు నోచుకోని వృద్ధులను చేరదీసి వారికి ప్రత్యేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. మదర్ థెరిసా సేవా సంస్థ అధ్యక్షుల ఆధ్వర్యంలో వృద్ధులకు క్షవరం, కటింగ్ చేయించి, శుభ్రంగా స్నానం చేయించారు. అనంతరం వారికి నూతన వస్త్రాలను అందించి, స్వయంగా ధరింపజేశారు. వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వృద్ధాప్యంలో శారీరకంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి చిన్నపాటి సహాయం కూడా ఎంతో విలువైనదని నిర్వాహకులు పేర్కొన్నారు. కుటుంబాలకు దూరమై ఒంటరిగా జీవిస్తున్న వృద్ధులకు ఆప్యాయత, ప్రేమ, ఆదరణ కల్పించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వృద్ధుల అనుభవాలు, జీవిత పాఠాలు నేటి తరానికి ఎంతో విలువైనవని తెలిపారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వారికి అవసరమైన సమయంలో సహాయం అందించాలని, వృద్ధులను గౌరవించడం మన సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం ద్వారా మానవత్వం, సేవాభావం చాటుకున్నామని నిర్వాహకులు తెలిపారు.

# కేటీఆర్ 8 వేల ఎకరాల కబ్జా ఆరోపణలపై ఎవిడెన్స్ ఏది

**- రేవంత్‌ను ప్రశ్నించిన ఎమ్మెల్యే గంగుల**



ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ 10 సంవత్సరాల్లో చాలాసార్లు కరీంనగర్ జిల్లాకు వచ్చారు. ఎప్పుడొచ్చినా కూడా కరీంనగర్ జిల్లాకు నిధుల వరదను తీసుకొచ్చి ఈ జిల్లాను రాష్ట్రంలోనే గొప్ప జిల్లాగా తీర్చిదిద్దారని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ.. కరీంగనర్ జిల్లాకు కేసీఆర్ ఎట్లా నిధులిచ్చారో.. నిన్న రేవంత్ వస్తున్నరు కదా నిధులిస్తడని భావించాం. 10 సంవత్సరాలు అభివృద్ధి పథంలో నడిపిస్తే నిన్న వచ్చిన రేవంత్ రెడ్డి ఆరోపణలు, విధ్వంసం, వ్యక్తిగత దూషణలకు పరిమితమైందని మండిపడ్డారు. వ్యక్తిగతంగా ఎందుకు దాడి చేస్తుండని అడిగితే.. ప్రభుత్వంలో ఏం చేయనీకి చేతనైతలేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఫైర్ అయ్యారు. ప్రజలు 1000 రోజులు పరిపాలనలో తీవ్రంగా నిరసిస్తుంటే.. డైవర్షన్ పాలిటిక్స్ చేయాలే. లేనిపోని ఆరోపణలు చేయడం, వ్యక్తిగత విమర్శలు చేయడం.. ఇది ఈ ముఖ్యమంత్రికి అలవాటైపోయింది.. మేం కూడా 15-16 సంవత్సరాలుగా నలుగురైదుగురు ముఖ్యమంత్రులను చూసినం. కేటీఆర్ 8 వేల ఎకరాలు కబ్జా చేశారు, సిరిసిల్లకు వస్తూ దానిపై ఎవిడెన్స్ తెస్తానని రేవంత్ రెడ్డి చాలా సార్లు అన్నాడు.. వచ్చేటప్పుడు తెస్తా అన్నఎవిడెన్స్ ఏది అని ప్రశ్నించారు. నిన్న రేవంత్ రెడ్డి వచ్చిందంతా బూటకమని తేలిపోయిందన్నారు. 1000 రోజులు పరిపాలనలో 420 హామీలైతే ఎలా బూటకమో.. ఎవిడెన్స్ తేలేకపోయిర్రు కాబట్టి కేటీఆర్ మీద చేసిన ఆరోపణలు కూడా బూటకమని నిన్న తేలిపోయిందని పేర్కొన్నారు.

# అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి.

**- జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి.**

**ప్రొద్దుటూరు:** జలజీవన్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5వ తేదీన ప్రొద్దుటూరుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, అధికారులను ఆదేశించారు. గురువారం ప్రొద్దుటూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శాసన సభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తదితరులతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి సభా ప్రాంగణం, వేదిక, బారికేడింగ్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, భద్రత తదితర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్ ప్రాంతాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. శాసన సభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు తొలిసారిగా ప్రొద్దుటూరు కు వస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి గారి పర్యటనను విజయవంతం అయ్యేలా అధికారులు పని చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి గారి పర్యటన ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టేలా ఏ శాఖకు కేటాయించిన విధులు ఆ శాఖ అధికారులు ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఏపి షేక్స్ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వి ఎస్ ముక్తియార్, ప్రొద్దుటూరు ఏఎస్పి కృష్ణ, జమ్మలమడుగు, కడప, బద్వేల్, పులివెందుల ఆర్డీఓ లు శిరీష, చంద్రశేఖర్, చిన్నయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ ఇర్విన్, డిఆర్డిఎ పిడి రాజ్యలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి,ఎస్ పిడిసిఎల్, ఎస్ఈ లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి, శాసన సభ్యులు ఎన్ వరదరాజుల రెడ్డి, జిల్లా ఎస్పీ షేల్కే నచికేత విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా నిధి మీనా, జిల్లా అధికారులతో కలిసి బహిరంగ సభ ప్రదేశం, హెలిప్యాడ్ ప్రదేశాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

# నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి

**- తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్**

**- 'జస్ ఆంకో' క్యాన్సర్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నగౌరవ్ ఉప్పల్...**

నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ కమిషన్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఉచ్వాస్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో 'జస్ ఆంకో' పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ కేర్ సెంటర్‌ను గురువారం ఆయన సంస్థ వ్యవస్థాపకురాలు డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి బాలకృష్ణన్‌తో కలిసి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సకు ప్రభుత్వం నుంచి పలు సేవలు అందిస్తున్నప్పటికీ ప్రైవేట్ సంస్థలు కూడా రోగులకు అందుబాటు ధరల్లో వైద్యాన్ని అందించాలని, ఇలాంటి కేంద్రాలు మరిన్ని రావాలని సూచించారు. జస్ ఆంకో ఫౌండర్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తమిళనాడు కేంద్రంగా కొనసాగుతున్న తమ సంస్థ కార్యకలాపాలు దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్నామని అందులో భాగంగానే తొలి కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని రోజుల తరబడి ఆస్పత్రుల్లో ఇన్‌పేషంట్‌గా ఉండాల్సిన అవసరం లేకుండానే ఎన్నో రకాల క్యాన్సర్ వ్యాధులకు డే కేర్ ప్రొసీజర్‌లో వైద్యం అందించనున్నట్లు ఆమె వెల్లడించారు. రోగులపై ఆర్థిక భారం తగ్గించే విధంగా తాము వైద్య చికిత్సా విధానలను అవలంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ డేకేర్ సెంటర్‌లో కీమోథెరపి, ఇమ్యునో థెరపి, టార్గెటెడ్ థెరపి వంటి వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉచ్వాస్ రిహాబిలిటేషన్ సెంటర్స్ చైర్మన్ డాక్టర్ అంబటి రాంపాపారావు, ఎంఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ రీజినల్ సెంటర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ముక్త శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రబీలో మెట్ట పంటల సాగుపై కిసాన్ గోష్టి

**- తక్కువ నీటితో మెట్ట పంటలు సాగు చేసుకోవాలి :**

**- వ్యవసాయ అధికారులు**



**ఆత్మకూరు:**ఎల్‌నినో ప్రభావంతో రబీ సీజన్‌లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగు చేసే మెట్ట పంటలను ఎంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చెన్నయ్య సూచించారు. రబీ సీజన్‌లో పంటల ఎంపిక, సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు కిసాన్ గోష్టి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త మోహన్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల్లో వివిధ పంటల్లో పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. శాస్త్రవేత్త అరుణ్ కుమార్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించడంతో పాటు పంట నష్టాలను నివారించవచ్చని తెలిపారు.తక్కువ నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా మినుము, శనగ, జొన్న, వేరుసెనగ, కుసుమ తదితర మెట్ట పంటలను సాగు చేయాలని సూచించారు. విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సరైన సమయంలో విత్తడం, ఎరువుల వినియోగం, కలుపు నివారణ వంటి అంశాల్లో శాస్త్రీయ పద్ధతులను పాటించాలని తెలిపారు.వర్షపు నీటిని పొలాల్లో నిల్వ చేసుకునేందుకు పంట అవశేషాలు, చిన్న నీటి కుంటలు, పొలాల చుట్టూ కాలువలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. అంతర పంటలు సాగు చేయడం, పంట అవశేషాలను నేలపై ఉంచడం, అవసరానికి అనుగుణంగా తక్కువ దున్నే పద్ధతులను అవలంబించడం ద్వారా పంటలకు మేలు జరుగుతుందని తెలిపారు.రైతులు నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. చీడపీడలను తొలి దశలోనే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని, రసాయన మందులను విచక్షణారహితంగా వినియోగించకుండా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సరైన మోతాదులోనే వినియోగించాలని తెలిపారు.రాయితీపై విత్తనాలు అందుబాటులో ఉన్నాయిఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కే. హేమలత మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలో భాగంగా రైతులకు రాయితీపై మినుము, కంది, కొర్ర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నాలుగు కిలోల విత్తనాల ప్యాకెట్ రూ.103.50కు, శనగ విత్తనాలు 35 శాతం రాయితీపై కిలో రూ.58.50కు అందుబాటులో ఉన్నాయని వివరించారు.జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. వెలుగోడు మండల వ్యవసాయ అధికారి స్వాతి మాట్లాడుతూ ఇప్పటివరకు పంటలు వేయని రైతులు తక్కువ నీటిని వినియోగించే, తక్కువ కాల వ్యవధి కలిగిన పంటలను ఎంచుకోవాలని తెలిపారు. నీటి వసతి ఉండి బెట్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆరు సాళ్లకు ఒక లోతు సాలు ఏర్పాటు చేయాలని, లేదా ఒక సాలు విడిచి ఒక సాలు సాగు చేయడం ద్వారా పంటలను కొంతమేర కాపాడుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, పాములపాడు, వెలుగోడు, కొత్తపల్లి మండలాల వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కావలిలో 'సేవా సంకల్ప్ యాత్ర'కు ఘన స్వాగతం

**.- స్వయంగా బైక్ నడిపి యువతలో జోష్ నింపిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి**

**- తిరుపతి నుంచి కాశీ వరకు ప్రతిష్ఠాత్మక మోటార్ సైకిల్ ర్యాలీ**

**- మోదీ 25 ఏళ్ల ప్రజాపాలన స్ఫూర్తితో యాత్ర: కావలి ఎమ్మెల్యే**



**కావలి :** దేశ ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రజాప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి నుంచి వారణాసి (కాశీ) వరకు చేపట్టిన ప్రతిష్టాత్మక "సేవా సంకల్ప్ యాత్ర" బైక్ ర్యాలీ గురువారం కావలి పట్టణానికి చేరుకుంది. ఈ యాత్రకు కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.పట్టణంలోని ఎస్ఎంకె కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, జెండా ఊపి బైక్ ర్యాలీని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొని కార్యకర్తలలో, యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.పవిత్ర తిరుపతి అలిపిరి పాదాల చెంత ప్రారంభమైన ఈ యాత్రలో తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఒఔాఈ), కూటమికి చెందిన 25 మంది ప్రతినిధులు బైకర్లుగా ఎంతో అంకితభావంతో పాల్గొంటున్నారని కొనియాడారు. ఈ యాత్ర అక్టోబర్ 8 నాటికి కాశీకి చేరుకుంటు ఒదని తెలిపారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ అందిస్తున్న సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, మోదీ 25 ఏళ్ల నిస్వార్థ ప్రజాసేవను చాటిచెప్పడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టీడీపీ కమిటీ నాయకులు, ఒఔాఈ ప్రతినిధులు, కూటమి ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

# అంగన్వాడీ టీచర్ బండారి ఉమా మహేశ్వరి దశదిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల నివాళులు



**కురవి** మండల కేంద్రానికి చెందిన బండారి రమేష్ సతీమణి, అంగన్వాడీ టీచర్ బండారి ఉమా మహేశ్వరి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో కురవి మండల కేంద్రంలోని వీరభద్ర ఏసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆమె దశదిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై నివాళులర్పించారు.ఈ సందర్భంగా మహేశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కురవి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాలగాని శ్రీనివాస్ గౌడ్, కురవి టౌన్ అధ్యక్షులు నారాయణ రాజేంద్రకుమార్, సమన్వయ కమిటీ అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు అంబటి వీరభద్ర గౌడ్, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, కురవి ఆలయ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, మండల ఉపాధ్యక్షులు అవిరే మోహన్ రావు, బానోత్ తుకారం నాయక్, ఆలయ ధర్మకర్త సక్రు నాయక్, నేరడ సర్పంచ్ గౌతమి వెంకన్న, గ్రామ అధ్యక్షులు బానోతు లాల నాయక్, బాదావత్ రామకృష్ణ, రాములు వెంకన్న, కురవి మాజీ వార్డు సభ్యులు బానోతు లక్ష్మణ్ నాయక్, బీఎల్ఏ కురవి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు బాలాజీ, రాములు, గుగులోతు బాలాజీ, దెబ్బేటి వెంకటయ్య, రామ్మూర్తి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 31 నాటికి వెయ్యి కిలోల వర్మీ కంపోస్ట్ సిద్ధం చేయాలి

**కొత్తపల్లి:** కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్



సెంటర్ (ాచిఖఅ)ను ఓఖఆా, డిప్యూటీ ఓఖఆా అధికారులు సందర్శించి అక్కడి నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ ఏర్పాట్లను పరిశీలించారు.వర్మీ కంపోస్ట్ తయారీ కోసం అవసరమైన ఔంఆఇఖ కంపోస్ట్‌ను ఇప్పటికే సిద్ధంగా ఉంచినట్లు అధికారులు గుర్తించారు. త్వరగా వానపాములను తీసుకువచ్చి సిద్ధంగా ఉన్న కంపోస్ట్‌లో వదిలి వర్మీ కంపోస్ట్ తయారీ ప్రక్రియను ప్రారంభించాలని సంబంధిత ఖఆాకు సూచించారు.అక్టోబర్ 31వ తేదీ నాటికి 1000 కిలోల వర్మీ కంపోస్ట్‌ను సిద్ధం చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. గ్రామాల్లో సేకరించే సేంద్రియ వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యమైన సేంద్రియ ఎరువును తయారు చేయాలని సూచించారు.ాచిఖఅ ద్వారా వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడంతో పాటు వర్మీ కంపోస్ట్ తయారీని ప్రోత్సహించాలని అధికారులు తెలిపారు. వర్మీ కంపోస్ట్ తయారీ లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

## జాతీయ లేజర్ రన్‌కు ఏకత్వా క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ.. నాశిక్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపిక




కంచికచర్ల(ప్రశ్న న్యూస్) వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలోని ఏకత్వా అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి లేజర్ రన్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-9 విభాగంలో గోగులమూడి లియోన్ సాహస్ విజయ్, నియా విజయ్, నక్కా జాన్ హైడ్, ఈదా నయన్‌రెడ్డి, గొట్టిపాటి శ్రీక్షిత, అండర్-11లో మల్లెల పవన్‌తేజ, అండర్-15లో శేషం రేచల్ ప్రియా ఎంపికైనట్లు కృష్ణా జిల్లా మోడర్న్ పెంటాతలన్ సంఘం కార్యదర్శి కోటా కృష్ణమోహన్ తెలిపారు. ఏలూరు జిల్లాలోని అల్లూరి సీతారామరాజు క్రీడా మైదానంలో జూలై 10 నుంచి 12 వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో మోడర్న్ పెంటాతలన్‌లో భాగమైన లేజర్ రన్ విభాగంలో జాతీయ పోటీలకు అర్హత సాధించారు. మహారాష్ట్రలోని నాశిక్‌లో అక్టోబరు 4 నుంచి 6 వరకు జాతీయస్థాయి పోటీలు జరగనున్నాయి.

**క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు**

జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ గురువారం ఏకత్వా పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ అమరనేని మనోజ్ మాట్లాడుతూ క్రీడలు కేవలం కాలక్షేపం కోసం కాదని అన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి, ఉజ్వల భవిష్యత్తుకు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి క్రీడలు పునాది వేస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ ఏదో ఒక ఆటను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, జిల్లాకు గర్వకారణమన్నారు. నాశిక్‌లో జరిగే జాతీయ పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

# తిరుమలలో రద్దీ.. అప్రమత్తంగా టీటీడీ

క్యూలైన్లలోనే అన్నప్రసాదం..

పాలు, మజ్జిగ, తాగునీరు

వైకుంఠం, నారాయణగిరి షెడ్లపై నిరంతర నిఘా

మొబైల్ క్లినిక్‌తో వైద్యసేవలు

నేడు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు





తిరుమల(ప్రశ్న న్యూస్) పెరటాసి మాసం.. వరుస సెలవులు.. శ్రీవారి దర్శనానికి భక్తుల పోటెత్తిన రద్దీ! తిరుమల కొండపై భక్తుల సంఖ్య భారీగా పెరగడంతో టీటీడీ యంత్రాంగం అప్రమత్తమైంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు, నారాయణగిరి షెడ్ల నుంచి ఆక్టోపస్ సర్కిల్ వరకు క్యూలైన్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్నప్రసాదం, తాగునీరు, వైద్యసేవలు, పారిశుద్ధ్య ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

### క్యూలోనే కడుపు నింపే ఏర్పాట్లు

రద్దీ కారణంగా భక్తులు క్యూలైన్లను వదిలి బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అక్కడికక్కడే అల్పాహారం, అన్నప్రసాదం, టీ, కాఫీ, పాలు, మజ్జిగ, తాగునీటిని పంపిణీ చేస్తున్నారు. అన్నప్రసాద విభాగం వాహనాల ద్వారా ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు క్యూలైన్ల వద్దకు తరలిస్తోంది. శ్రీవారి సేవకులు భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంతో పాటు అవసరమైన చోట సౌకర్యాల కల్పనలో సిబ్బందికి సహకరిస్తున్నారు.

### మరుగుదొడ్లపై ప్రత్యేక నిఘా

భక్తుల రద్దీకి అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. క్యూలైన్లలోని మరుగుదొడ్లను తరచూ శుభ్రం చేస్తూ, చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. రద్దీ సమయంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.

### అస్వస్థతకు తక్షణ వైద్యం

భక్తుల ఆరోగ్యంపై కూడా టీటీడీ ప్రత్యేక దృష్టి సారించింది. క్యూలైన్లలో అత్యవసర వైద్యసేవలు అందించేందుకు మొబైల్ క్లినిక్ నిరంతరాయంగా అందుబాటులో ఉంది. అవసరమైన భక్తులకు అక్కడికక్కడే ప్రాథమిక వైద్యసేవలు అందిస్తున్నారు.

### రద్దీపై విజిలెన్స్ నిఘా

వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1, 2, నారాయణగిరి షెడ్లు, ఆక్టోపస్ సర్కిల్ వరకు క్యూలైన్లను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. విజిలెన్స్, ఆరోగ్యం, అన్నప్రసాదం, శ్రీవారి సేవ తదితర విభాగాల సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నారు. రద్దీ పరిస్థితిని అంచనా వేస్తూ అవసరమైన చోట తక్షణ చర్యలు చేపడుతున్నారు.

### వీఐపీ దర్శనాలకు బ్రేక్

భక్తుల అధిక రద్దీ నేపథ్యంలో సర్వదర్శనం భక్తులకు ఎక్కువ సంఖ్యలో దర్శనం కల్పించేందుకు అక్టోబరు 1న వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. రద్దీ తగ్గే వరకు భక్తుల సౌకర్యానికే ప్రాధాన్యం ఇస్తూ ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# అభివృద్ధే మా జవాబు

విమర్శలు చేసేవారు కాశీపురం రావాలి

రూ.1.85 కోట్ల పనులకు శంకుస్థాపన.. పింఛన్ల పంపిణీ

“ఏం చేశారో.. ఏం చేస్తున్నామో ప్రజలే చూస్తున్నారు”: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



కురిచేడు(ప్రశ్న న్యూస్) విమర్శలు చేసే నేతలకు మాటలతో కాకుండా అభివృద్ధి పనులతోనే సమాధానం చెబుతామని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. కురిచేడు మండలం కాశీపురం గ్రామంలో శనివారం రూ.1.85 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. పింఛన్లను పంపిణీ చేయడంతో పాటు పీ-4 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ “విమర్శలు చేసే నేతలు కాశీపురం గ్రామానికి వచ్చి అభివృద్ధి పనులు చూడాలి. ఏం చేస్తున్నామో తెలుసుకోవాలి” అని అన్నారు.

### ఐదేళ్లలో ఏం చేశారు?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని లక్ష్మి తెలిపారు. కాశీపురం గ్రామంలోనే రెండేళ్లలో సుమారు రూ.2.25 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. గత ఐదేళ్ల పాలనలో కాశీపురం గ్రామానికి ఎంతమేర అభివృద్ధి నిధులు కేటాయించారో ప్రజలకు చెప్పాలని ఆమె ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల్లో రహదారులు, మౌలిక వసతులతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలుపైనా దృష్టి పెట్టిందన్నారు.

### ‘ప్రజల మధ్యే ఉంటున్నా’

ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తున్నానని గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. “నేను మీ ఆడబిడ్డను. మీలో ఉంటున్నాను. మీ సమస్యలు వింటున్నాను. మీ మధ్యకు వస్తున్నాను. సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తున్నాను” అని ఆమె అన్నారు. ప్రజలు తనపై చూపుతున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. పేదలు, వృద్ధులు, వికలాంగులు తదితరులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ల పంపిణీలో ప్రత్యక్షంగా పాల్గొని వారికి భరోసా కల్పించారు. కాశీపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నట్లు తాజా స్థానిక నివేదిక కూడా పేర్కొంది. కార్యక్రమంలో దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి-సుబ్బారావు, కురిచేడు మండల టీడీపీ అధ్యక్షుడు విడతల నెమిలయ్య, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు కాట్రాజు నాగరాజు, ఎంపీడీవో, సీనియర్ జర్నలిస్టు గొట్టిపాటి నాగేశ్వరరావు, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఘనపతి వెంకటేశ్వర్లు, ఐ-టీడీపీ మండల అధ్యక్షుడు కాళ్ల వెంకటేశ్వర్లు, కాశీపురం గ్రామ టీడీపీ నాయకులు శేఖర్, చిన్న వెంకట సుబ్బయ్య, కాటం రాజు, మాజీ సర్పంచ్ సుబ్బయ్య, వీరనారాయణ, మస్తాన్‌వలి, డాక్టర్ సునీల్, కొండయ్య, ఆదినారాయణ, నూనె విజయకుమారి, ఇజ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థారాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు

## జడ్పీహెచ్ఎస్ విద్యార్థినిలు ఎంపిక

**తాండూర్ :** రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు మంచిర్యాల జిల్లా అచ్చలాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినిలు ఎంపికైనట్లు పీడీ ఏ సాంబమూర్తి తెలిపారు. ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి రెజ్లింగ్ అండర్-14 62కేజీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన పి అశ్విత ,అండర్-17 42 కేజీ విభాగంలో చౌల్ల హర్షిత , 72కేజీ విభాగంలో కే శ్రీవల్లి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. 35కేజీ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన ఎన్ నిత్య ప్రసన్న , 45కేజీ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన బి రమాదేవి , 38కేజీ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన జి అజయ్ ఎంపికయ్యారని తెలిపారు. మెడల్స్, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి ఉమాదేవి, ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, వార్డు సభ్యులు దాగం పాపయ్య, నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు విద్యార్థులను అభినందించారు.

# తరగతి గదులున్నా.. బయటే చదువులు

స్టాల్ బాలికల హైస్కూల్‌లో ఎమ్మెల్యే

గళ్ళా మాధవి ఆకస్మిక తనిఖీ

పాఠశాల నిర్వహణపై ఆగ్రహం.. వారం రోజుల్లో

సమస్యలు పరిష్కరించాలని ఆదేశం





గుంటూరు(ప్రశ్న న్యూస్) తరగతి గదులు అందుబాటులో ఉన్నప్పటికీ ఆరో తరగతి విద్యార్థినులు బయట కూర్చొని చదువుకోవడంపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంపాలెంలోని స్టాల్ గర్ల్స్ హైస్కూల్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల హాజరు, తరగతి గదులు, మౌలిక వసతులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం, కంప్యూటర్ ల్యాబ్ శిథిలావస్థకు చేరడం, స్టోర్ రూముల పరిస్థితి అధ్వానంగా ఉండటం, కొన్ని తరగతి గదుల్లో సరిపడా ఫ్యాన్లు లేకపోవడాన్ని ఆమె గుర్తించారు. పెద్ద తరగతి గదులు ఉన్నప్పటికీ వాటిని ఇతర అవసరాలకు వినియోగిస్తూ విద్యార్థినులను బయట కూర్చోబెట్టడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే వారికి ప్రత్యేక తరగతి గదులు కేటాయించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు.

### నిర్వహణపై అసంతృప్తి

ఎమ్మెల్యే తనిఖీ సమాచారం అందుకున్న ఎంఈఓ నాగేంద్రమ్మ పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్, ఎంఈఓ మధ్య సమన్వయం సరిగా లేకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల, బాలికల హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

### ‘పూర్వ వైభవం తీసుకురావాలి’

పిల్లలు చదివే పాఠశాలలు దేవాలయాల వంటివని, విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని గళ్ళా మాధవి అన్నారు. ఒకప్పుడు వేలాది మంది బాలికలు చదువుకున్న స్టాల్ గర్ల్స్ హైస్కూల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థగా పేరొందిందన్నారు. కాలక్రమేణా నిర్వహణలో తలెత్తిన సమస్యలతో విద్యార్థినుల సంఖ్య తగ్గడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పాఠశాలకు వెళ్లే రహదారి, సీసీ కెమెరాల ఏర్పాటు, బాలికల హాస్టల్ పరిసరాల పరిస్థితిపై గతంలోనూ సూచనలు చేసినట్లు తెలిపారు. ఎయిడెడ్ సంస్థ కావడంతో ప్రభుత్వ నిధుల విషయంలో పరిమితులు ఉన్నప్పటికీ యాజమాన్యం బాధ్యతగా వ్యవహరించి పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం ఎలక్ట్రికల్ పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎమ్మెల్యే సూచించిన అంశాలను వారం రోజుల్లో సరిదిద్దుతామని పాఠశాల ప్రిన్సిపాల్ హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. వారం తర్వాత మరోసారి పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అధికారులు, యాజమాన్యం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావచ్చని పేర్కొన్నారు.

# పొలమే ప్రయోగశాల.. రైతే శాస్త్రవేత్త

- ‘పొలంబడి’తో సాగులో సరికొత్త మార్పు- తక్కువ పెట్టుబడి.. మెరుగైన దిగుబడే లక్ష్యం
- శాస్త్రీయ పద్ధతులకు ఆచరణాత్మక శిక్షణ.. 175 ఎకరాల్లో 175 మంది రైతులకు అవగాహన





పార్వతీపురం(ప్రశ్న న్యూస్) పొలమే ప్రయోగశాలగా మారింది.. రైతే శాస్త్రవేత్తగా మారుతున్నాడు. పుస్తకాల్లో చదివిన వ్యవసాయ సాంకేతికతను పొలంలోనే ప్రయోగిస్తూ.. పంట ఎదుగుదలను కళ్లారా పరిశీలిస్తూ.. ఏ సమయంలో ఏ పద్ధతి పాటించాలి? ఎలాంటి సమస్యకు ఎలాంటి పరిష్కారం? పెట్టుబడి ఎలా తగ్గించాలి? దిగుబడి ఎలా పెంచాలి? అనే అంశాలను రైతులు స్వయంగా నేర్చుకుంటున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ‘పొలంబడి’ కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లాలో రైతుల సాగు విధానాల్లో మార్పునకు బాటలు వేస్తోంది. సంప్రదాయ సాగు పద్ధతులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని జోడించి, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అధికారుల కార్యాలయాల్లో జరిగే సమావేశాలకే పరిమితం కాకుండా.. నేరుగా రైతు పొలంలోకి వెళ్లి శిక్షణ ఇవ్వడం పొలంబడి ప్రత్యేకత. దీంతో రైతులకు చెప్పే మాటలు కేవలం సూచనలుగా మిగిలిపోకుండా.. ఆచరణలో ఎలా ఉంటాయో ప్రత్యక్షంగా చూపిస్తున్నారు.

### ఏడు మండలాల్లో ఆచరణాత్మక శిక్షణ

ఖరీఫ్--2026లో జిల్లాలోని మక్కువ, బలిజిపేట, వీరఘట్టం, భామిని, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, సాలూరు మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. లొవర్కండి, నూకలవాడ, కంబర, మణిగ, జియ్యమ్మవలస, నాగూరు, సారికి గ్రామాల్లో రైతులతో కలిసి అధికారులు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. మొత్తం 175 ఎకరాల్లో 175 మంది రైతులకు ప్రత్యక్షంగా శిక్షణ అందిస్తున్నారు. మక్కువ, బలిజిపేట, వీరఘట్టం, భామిని, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లో వరి పంటను, సాలూరు మండలం సారికి గ్రామంలో రాగి పంటను పొలంబడి కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేశారు.

### ఒక ఎకరం.. ఎన్నో ప్రయోగాలు

ప్రతి గ్రామంలో ఒక ఎకరం విస్తీర్ణాన్ని ప్రయోగాత్మకంగా, ఐసీఎం ప్లాట్‌గా ఎంపిక చేసి అక్కడ శాస్త్రీయ సాగు విధానాలను ప్రదర్శిస్తున్నారు. సాధారణంగా రైతులు తమ అనుభవంతో అనుసరించే పద్ధతులకు భిన్నంగా.. శాస్త్రీయ సాంకేతికతను పొలంలో అమలు చేసి దాని ఫలితాలను చూపిస్తున్నారు. పంట విత్తే దశ నుంచి కోత వరకు పాటించాల్సిన పద్ధతులను రైతులకు దశలవారీగా వివరిస్తున్నారు. నేల స్వభావం, విత్తనాల ఎంపిక, నాటే విధానం, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, కలుపు నివారణ, చీడపీడల గుర్తింపు, పంట సంరక్షణ, పంట ఎదుగుదలను పరిశీలించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

# ప్రభుత్వ భూమిలో నిర్మాణం..

# ఎనిమిది మందిపై కేసు

## హాఫీజ్‌పేట రేగుల కుంట శిఖం భూమి వ్యవహారం



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) హాఫీజ్‌పేట రేగుల కుంట శిఖం ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టినట్లు వచ్చిన ఫిర్యాదుపై మియాపూర్ పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. సర్వే నంబర్ 151లోని ప్రభుత్వ భూమిలో 372.5 చదరపు గజాల్లో ఐదు అంతస్తుల భవనం నిర్మిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వేలో నిర్మాణం సర్వే నంబర్ 151లోని ‘రేగుల కుంట శిఖం సర్కారీ’ భూమిలో ఉన్నట్లు తేలినట్లు తెలిపారు. అయితే సర్వే నంబర్ 150లోని పట్టా భూమికి సంబంధించిన పత్రాలతో నిర్మాణానికి అనుమతులు పొందినట్లు ఆరోపించారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాన్ని తొలగించాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పనులు కొనసాగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసు కేసు: తహసీల్దార్ కె. మహిపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు క్రైమ్ నంబర్ 1375/2026గా కేసు నమోదు చేశారు. ఎన్. పవన్‌కుమార్, వి. శ్రీనివాసరావు, కె.వి.ఆర్.ఐ. శర్మ, జి. వెంకట్ శివప్రసాద్, డి.వి. వెంకట మంగ లక్ష్మి, పిన్నమనేని శ్రీను, సంపత్ కర్రి, మామిళ్లపల్లి శ్రీనివాసరావులపై కేసు నమోదైంది. నమోదైన సెక్షన్లు: భారతీయ న్యాయ సంహిత 329(3), 324(4) కింద నమచేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ కె. రాజేశ్వర్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

# తీరు మార్చుకోని వాహనదారులు

- హెచ్చరికలను బేఖాతరు చేస్తూ రాంగ్ రూట్ ప్రయాణాలు
- యూటర్న్ మూసివేసి బోర్డులు పెట్టినా ఆగని నిర్లక్ష్యం
- ఇటీవల స్కూల్ బస్సు-బైక్ ఢీకొన్న ఘటనతో రంగంలోకి పోలీసులు
- సెప్టెంబర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 33 మందికి జైలు శిక్ష

**రాంగ్ రూట్‌లో వస్తే ఎఫ్ఐఆర్ తప్పదు : మేడ్చల్ ట్రాఫిక్ సీఐ క్రాంతి కుమార్ హెచ్చరిక**







మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) నిత్యం రద్దీగా ఉండే రహదారులపై ప్రమాదాలు పొంచి ఉన్నప్పటికీ కొందరు వాహనదారుల తీరు ఏమాత్రం మారడం లేదు. ట్రాఫిక్ పోలీసులు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నా, సూచనలు చేస్తున్నా నిబంధనలను బేఖాతరు చేస్తూ కొందరు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ ప్రైవేటు పాఠశాల బస్సు రాంగ్ రూట్లో వచ్చి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రత దృష్ట్యా, ఇలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. ప్రమాదాల నివారణ కోసం సంఘటన స్థలంలో ఉన్న ప్రమాదకర యూటర్న్‌ను పూర్తిగా మూసివేసి, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు స్పష్టమైన ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

**బోర్డులు పెట్టినా బేఖాతరు :**

పోలీసులు ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ కొందరు వాహనదారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఏ మాత్రం భయం లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, మళ్లీ అదే రాంగ్ రూట్లలో ప్రమాదకర రీతిలో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పాటు గత నెల సెప్టెంబర్‌లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని కోర్టులో ప్రవేశపెట్టగా దాదాపు 33 మందికి న్యాయస్థానం జైలు శిక్ష విధించిందని సీఐ గుర్తుచేశారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరి ప్రాణరక్షణ కోసమేనని, వాహనదారులు స్వచ్ఛందంగా సహకరించి సురక్షిత ప్రయాణాన్ని సాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే ఎఫ్ఐఆర్ తప్పదు : సీఐ క్రాంతి కుమార్**

హెచ్చరికలను సైతం లెక్కచేయకుండా ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్న వారిపై మేడ్చల్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల భద్రత కోసమే యూటర్న్ మూసివేసి హెచ్చరిక బోర్డులు పెట్టామని, వాటిని



ఉల్లంఘించే వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇకపై ఎవరైనా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ పట్టుబడితే నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

## రక్తదానం పై అపోహలు వద్దు

### రక్తదానం చేసి వేరొకరి ప్రాణాలు కాపాడండి



నాచారం (ప్రశ్న న్యూస్) రక్తదానం ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలతో ప్రజలను చైతన్య పరిచి ప్రతి ఒక్కరు రక్తదానం చేసేలా ప్రోత్సహించాలని నాచారం ఈఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. సత్యనారాయణ పిలుపునిచ్చారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి లోని బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గోన్న డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతు ఆధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో అవసరమైన వారికి రక్తాన్ని దానం చేయడం మానవత్వంలో ఒక ముఖ్యమైన భాగమని అన్నారు. బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ పావని కులకర్ణి మాట్లాడుతు సురక్షిత రక్తదానంతో వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. స్వచ్ఛంద రక్తదానం పట్ల ప్రజల్లో ఉన్న అజ్ఞానం, భయం, అపోహలను తొలగించడానికి స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి అవగాహన కార్యక్రమాలతో ప్రజలను చైతన్య పరిచి స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు.
స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యులు, సిబ్బంది, స్వచ్ఛంద రక్తదాతలతో స్వచ్ఛంద రక్తదాన ప్రతిజ్ఞ చేయించారు.

**ప్రతిజ్ఞ**

నేను, స్వచ్ఛందంగా క్రమం తప్పకుండా రక్తదానం చేసి, ప్రాణాలను కాపాడతానని, మానవ సేవలో నిస్వార్థంగా పాల్గోంటానని హృదయపూర్వకంగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. అనంతరం డాక్టరు. సత్యనారాయణ, డాక్టర్ పావని కులకర్ణి రక్తదాతలతో కేక్ కట్ చేయించి, ప్రశంసా పత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## గ్రాడ్యుయేట్ ఏంఎల్‌సీగా అవకాశమివ్వండి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్‌ను ఒక శక్తివంతమైన, సంపన్న, ఆధునిక దేశంగా తీర్చిదిది, ప్రాచీన భారతీయ సంస్కృతి, విలువల నుండి ప్రేరణ పొందుతు, ప్రపంచ దేశాల సరసన భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టడమే భారతీయ జనతా పార్టీ ముందున్న ఏకైక లక్ష్యమని కామధేను ఫౌండేషన్ అధ్యక్షులు పి. వెంకటేష్ అన్నారు. న్యూఢిల్లీలోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బీజేపి ఇంచార్జ్ సునీల్ బన్సల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, త్వరలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల గ్రాడ్యుయేట్ ఏంఎల్‌సీ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించాలని కోరుతు వినతి పత్రం అందజేసారు. సందర్భంగా పి వెంకటేష్ మాట్లాడుతు తన 30 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలోని అంశాలను ప్రస్తావించారు. విద్యార్థి దశ నుండే ఏబివిపి కార్యకర్తగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గోన్నట్లు తెలిపారు. అలాగే ఆల్విన్ కంపెనీలో 10 సంవత్సరాల పాటు బి.యం.ఎస్ కార్మిక నాయకునిగా, 20 సంవత్సరాలు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తు టి.టి.యు రాష్ట్ర నాయకునిగా బాధ్యతలు నిర్వర్తించానని తెలిపారు. అలాగే బీసీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు, ఆర్ కృష్ణయ్యతో కలిసి పలు బీసీ ఉద్యమాలలో పాల్గోనడమే కాక ఎన్ఆర్ఐ బీసి సెల్ నేషనల్ కన్వీనర్‌గా విదేశాల్లో ఉంటున్న బీసీలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. బీజేపీ పార్టీలో ఇంటలేక్చువల్ కన్వీనర్‌గా, ఎస్ఆర్‌డిగా పనిచేస్తు ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రాల్లోని బీసీల అభ్యున్నతి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తున్నానని తెలిపారు. అలాగే కామధేను ఫౌండేషన్ అధ్యక్షునిగా మహబుబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్‌తో పాటు పలు జిల్లాల్లోని పాఠశాలల్లో ఫర్నిచర్, స్టేషనరీ వంటి మౌళిక సదుపాయాల కల్పన, ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత వైద్యం, మందులు, భోజన సదుపాయాలు కల్పిస్తు పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. బీజేపీ కార్యకర్తగా పార్టీ పటిష్టతకు నిరంతరం పాటుపడుతున్న తన కృషిని గుర్తించి బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు యంఎల్‌సి (గ్రాడ్యుయేట్స్) స్థానం నుండి అవకాశం కల్పించాలని కోరారు.

# ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలి

**పర్యావరణ హిత వస్తువులనే వినియోగించాలి: స్వచ్ఛ ఆంధ్ర చైర్మన్ పట్టాభిరామ్**

**గూడవల్లిలో 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమం, పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్న చైర్మన్, డైరెక్టర్లు**

విజయవాడ (ప్రశ్న న్యూస్) ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, పర్యావరణానికి హాని కలిగించని వస్తువులను వినియోగించే అలవాటును ప్రజలు పెంపొందించుకోవాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గ్రామీణ మండలం గూడవల్లి గ్రామంలో గురువారం 'స్వచ్ఛత హీ సేవ'లో భాగంగా నిర్వహించిన 'ఒక రోజు.. ఒక గంట.. అందరం కలిసి' పారిశుద్ధ్య కార్యక్రమంలో పట్టాభిరామ్‌తో పాటు కార్పొరేషన్ డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పాల్గొన్నారు. స్వయంగా శ్రమదానం చేసి రహదారులను శుభ్రం చేశారు. కొడవళ్లతో తుప్పలను తొలగించి, మొక్కలు నాటారు.

### వ్యర్థాలపై అవగాహన

గ్రామంలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని, ఐఈసీ వాల్ పెయింటింగ్స్‌ను, జేసీబీతో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను, స్వచ్ఛరథాన్ని పరిశీలించారు. మట్టితో తయారు చేసిన గ్లాసులు, వాటర్ బాటిళ్లు, చెక్క స్పూన్లు, పేపర్ గ్లాసులు తదితర పర్యావరణహిత వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. కళాశాల విద్యార్థులకు పారిశుద్ధ్యం, వ్యర్థాల విభజనపై అవగాహన కల్పించారు. చెత్తను నాలుగు రకాలుగా విభజించి సక్రమంగా నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. గ్రామ పంచాయతీలో వ్యర్థాల విభజనను ప్రోత్సహించిన స్వయం సహాయక సంఘాల మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

### పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

గ్రామంలో పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న కార్మికులను చైర్మన్, అధికారులు సత్కరించారు. వారికి స్వీట్ బాక్సులు అందజేసి పారితోషికాలు ఇచ్చారు. ఏఎన్ఎంల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

### 'స్వచ్ఛ ఆంధ్ర'కు అడుగు ముందుకు

ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి సమస్యగా మారుతోందన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా బయోడీగ్రేడబుల్, డిస్పోజబుల్ వస్తువులను వినియోగించాలని సూచించారు. "స్వచ్ఛత కోసం మనమంతా కలిసి ఒక అడుగు ముందుకు వేద్దాం. పరిశుభ్రమైన సమాజం కోసం మన వంతు సహకారం అందిద్దాం. పరిశుభ్రతను పాటిస్తూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములం కావాలి" అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు చిన్ని శ్రీనివాసరావు, రవికుమార్, ఆరుద్ర



భూలక్ష్మి, లక్ష్మణరావు బొమ్మినేని, ఎం.నాగలక్ష్మి, ఎన్.పర్వీన్ భాను, నాగమణి బోలెం, పరుచూరి భవానీ రవికుమార్, రాము బుచ్చా, రెడ్డివారి మంజునాథ్, సానారెడ్డి కల్పనారెడ్డి, ఉదయభాస్కర్ కూచిపూడి, పట్టాభిరామయ్య సాలాది, మువ్వల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. కార్పొరేషన్ ఈడీలు ఊర్మిళాదేవి, అర్జునరావు, ఎఫ్ఎం విజయశేఖర్‌తో పాటు ఎన్టీఆర్ జిల్లా పరిషత్ సీఈఓ డాక్టర్ జె.అరుణ్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫ్లైదుబాయ్ పైలట్ స్మిత్ మచ్చర్ ఎయిర్‌లిఫ్ట్

**- చికిత్స కోసం యూఏఈకి తరలింపు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో జరిగిన దాడిలో గాయపడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం యూఏఈకు ఎయిర్‌లిఫ్ట్ చేశారు. దుబాయ్-ఇజ్రాయెల్ విమానంలో కో-పైలట్ దాడికి దిగిన అనంతరం, ఆ విమానం సౌదీ అరేబియాలో సురక్షితంగా ల్యాండ్ అయిన విషయం విదితమే. విమానం ల్యాండ్ అయిన వెంటనే కెప్టెన్ మచ్చర్‌ను అక్కడి సైనిక ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయనను తదుపరి వైద్యం కోసం యూఏఈకి తరలించగా, స్మిత్ మచ్చర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. కాగా, సహ పైలట్ జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడినప్పటికీ, కెప్టెన్ స్మిత్ మచ్చర్ అసాధారణ ధైర్యసాహసాలను ప్రదర్శించి 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు.

# అరకు కాఫీకి అంతర్జాతీయ 'కిక్'

**- గిరిజన రైతుల కష్టానికి ప్రపంచ గుర్తింపు.. - గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్**

విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) గిరిజన రైతులు ఎంతో శ్రమించి సాగు చేస్తున్న అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చర్యలు చేపడుతోందని ఆ సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలోని జీసీసీ ప్రధాన కార్యాలయంలో ఉన్న అరబికా అరకు వ్యాలీ కాఫీ కేఫ్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కేఫ్‌కు వచ్చిన ప్రతి కస్టమర్‌కు ఉచితంగా అరకు కాఫీ అందించారు. కాఫీ రుచి, ప్రత్యేకతలను వినియోగదారులకు వివరించారు.

### ప్రపంచ మార్కెట్‌పై దృష్టి

కిడారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి జీసీసీ కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు కల్పించేందుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు.
ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో అరకు కాఫీ గురించి ప్రస్తావించడంతో దేశవ్యాప్తంగా దీనికి మరింత గుర్తింపు లభించిందన్నారు. అరకు కాఫీని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు సహకరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి




ధన్యవాదాలు తెలిపారు.

### దావోస్.. పారిస్ వరకు

పారిస్ వంటి అంతర్జాతీయ నగరాలతో పాటు దావోస్‌లోనూ అరకు కాఫీని పరిచయం చేస్తున్నామని చైర్మన్ పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్‌లో అరకు కాఫీకి మరింత ఆదరణ లభించేలా ప్రచారం, మార్కెటింగ్ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు.అంతర్జాతీయ మార్కెట్ విస్తరణ ద్వారా గిరిజన కాఫీ రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు, మెరుగైన ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.కార్యక్రమంలో జీసీసీ జనరల్ మేనేజర్ (అడ్మినిస్ట్రేషన్) సంధ్యారాణి, ఫైనాన్స్ జనరల్ మేనేజర్ ఉమాదేవి, డీసీఎం సూర్యనారాయణ, డివిజనల్ మేనేజర్లు మహేంద్ర, దేవరాజ్, జీసీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ‘ది కోర్ట్’ సిరీస్ రివ్యూ!



యోగలక్ష్మికి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ‘టూరిస్ట్ ఫ్యామిలీ’ సినిమా .. ‘హార్ట్ బీట్’ సిరీస్ లో ఆమె చేసిన పాత్రలు అందుకు కారణంగా చెప్పుకోవచ్చు. ‘హార్ట్ బీట్’లో యోగలక్ష్మి చేసింది నెగెటివ్ షేడ్స్ తో కూడిన పాత్ర. అయినప్పటికీ ఆకర్షణీయమైన ఆమె కళ్లు అందరినీ కట్టిపడేశాయి. అలాంటి యోగలక్ష్మి ప్రధానమైన పాత్రగా రూపొందిన సిరీస్ గా ‘ది కోర్ట్’ కనిపిస్తుంది. తమిళంలో రూపొందిన ఈ సిరీస్ నుంచి ఇంతవరకూ 16 ఎపిసోడ్స్ ను వదిలారు. తెలుగులోను అందుబాటులో ఉన్నాయి. ‘యాలిని’ (యోగలక్ష్మి) ‘లా’ పూర్తి చేస్తుంది. సిటీకి చేరుకుని అక్కడ తన స్నేహితులు ఉండే పీజీలో దిగుతుంది. హైకోర్టులో జూనియర్ గా అవకాశాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నాలు మొదలెడుతుంది. ‘బార్’ ఎలక్షన్స్ దగ్గర పడటంతో, హై కోర్టులో సీనియర్ న్యాయవాదుల మధ్య కోల్డ్ వార్ నడుస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తనకి ఛాంబర్ లేకుండా చేసిన ‘వేణి చంద్రకాంత్’ (ముక్తా జార్జ్) పై అడ్వకేట్ దేవా ( అర్జున్ శ్యామ్) అసహనంతో ఉంటాడు. ఆమె ఛాంబర్ ను షేర్ చేసుకోవాలనే పట్టుదలతో ఉంటాడు. ‘వేణి’ ఆ కోర్టులో 15 ఏళ్లుగా అడ్వకేట్ గా పనిచేస్తూ ఉంటుంది. ఆమె దగ్గర ముత్తు .. విశ్వ .. కీర్తన జూనియర్స్ గా ఉంటారు. ఆ కోర్టుకి సంబంధించిన క్యాంటీన్ ను వేణి భర్త ‘సత్య’ నడుపుతూ ఉంటాడు. ఆ కోర్టు ఆవరణలో ఎవరు అడుగుపెట్టినా క్యాంటీన్ నడుపుతున్న సత్యకి .. ‘టీ’లు మోసే ‘సుడాలి’కి తెలిసిపోతుంది. అందువలన ఆ కోర్టు ఆవరణలోకి అడుగుపెట్టిన ‘యాలిని’కి ముందుగా వాళ్లే తారసపడతారు. అలాంటి ఒక తెలివైన అమ్మాయి, వేణికి జూనియర్ గా ఉంటే బాగుంటుందని సత్య భావిస్తాడు. అయితే దేవాకి జూనియర్ గా ‘యాలిని’ చేరిపోతుంది. అప్పటికే దేవాకి ‘దివి’ అనే ఓ పదేళ్ల కూతురు ఉంటుంది. ఆమె తల్లిని గురించి అడిగే సాహసం చేయలేకపోతుంది యాలిని. ఆమె ధోరణి వేణి జూనియర్స్ ను తీవ్రమైన అసహనానికి గురిచేస్తుంది. సమయం చూసి యాలినిని దెబ్బకొట్టాలని వాళ్లు నిర్ణయించుకుంటారు. అందుకోసం వాళ్లు ఏం చేస్తారు? యాలిని ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది? ఆమె తీసుకునే కేసులు ఎలాంటి సవాళ్లను విసురుతాయి? అనేది మిగతా కథ. ‘జియో హాట్ స్టార్’ నుంచి వచ్చిన ‘హార్ట్ బీట్’ హాస్పిటల్ నేపథ్యంలో .. ఫ్యామిలీ ఎమోషన్స్ తో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆ తరువాత వచ్చిన సిరీస్ గా ‘ఆఫీస్’ కనిపిస్తుంది. ఒక విలేజ్ నేపథ్యంలో తహసీల్దార్ ఆఫీస్ చుట్టూ తిరిగే కథతో రూపొందిన ఈ సిరీస్ కూడా ఆడియన్స్ నుంచి మంచి మార్కులు కొట్టేసింది. ఈ నేపథ్యంలో వదిలిన మరో సిరీస్ ‘ది కోర్ట్’. కోర్టు బయట .. లోపల చోటుచేసుకునే సన్నివేశాలతో నడిచే సిరీస్ ఇది. యాలిని కొత్తగా కోర్టు ప్రాంగణంలోకి అడుగుపెట్టడం .. అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం .. తన తెలివి తేటలతో జూనియర్ గా అవకాశాన్ని సంపాదించడం .. సీనియర్స్ మధ్యనున్న స్పర్థలను గమనించడం .. అమాయకంగా ఉంటే తన క్రెడిట్ ను కొట్టేయడానికి అవతలవాళ్లు ఆలోచించరనే విషయాన్ని పసిగట్టడం .. ధైర్యంగా ఆ సమస్యను అధిగమించడం వంటి సన్నివేశాలతో ఈ సిరీస్ ముందుకు వెళుతుంది. ప్రధానమైన పాత్రల సంఖ్య .. అందుకు సంబంధించిన ట్రాకులు చూస్తే, ఇది చాలా భారీ సిరీస్ అనే విషయం అర్థమవుతుంది. అయితే కథను యెత్తుకున్న విధానం .. కొన్ని ఎపిసోడ్స్ వరకూ ఆ పాత్రలను నడిపించిన తీరు సాదాసీదాగానే అనిపిస్తుంది. ఆరంభంలోని ఎపిసోడ్స్ ఫ్యామిలీ ఎమోషన్స్ వైపు వెళ్లని కారణంగా, కోర్టులో కథ అక్కడక్కడే తిరుగుతున్నట్టుగా అనిపిస్తుంది. ఆ సన్నివేశాలు అంత బలంగా అనిపించనూ లేదు. అయితే ‘యాలిని’ పాత్ర వెనుక కూడా బలమైన కథ ఏదో ఉందనే విషయం ప్రేక్షకులకు అర్థమవుతుంది. అలాగే వేణి భర్త క్యాంటీన్ కి ఎందుకు పరిమితమయ్యాడనే ఒక సందేహం తలెత్తుతుంది. ఇక దేవా ఫ్యామిలీ లైఫ్ లోని చిక్కులు ఎలాంటివి అనేది కూడా కుతూహలాన్ని పెంచుతుంది. ఇలా ప్రధానమైన పాత్రలకు సంబంధించిన నేపథ్యాలు ఆడియన్స్ ముందుకు ఇంకా రాలేదు. అలాగే మరికొన్ని కొత్త పాత్రలు కూడా ఎంట్రీ ఇచ్చే అవకాశాలు కూడా పుష్కలంగానే ఉన్నాయి. భారీ తారాగణంతో రూపొందిన ఈ సిరీస్ నుంచి ఇంకా చాలా ఎపిసోడ్స్ రావలసి ఉండొచ్చు. కానీ ఆరంభంలో ఎపిసోడ్స్ ఆ దిశగా నడిపించేవి అయ్యుండాలి. ఒక ఎపిసోడ్ ను మించి మరొక ఎపిసోడ్ ఉత్కంఠను రేకెత్తించాలి. కానీ ఈ సిరీస్ కథ చాలా నిదానంగా .. నింపాదిగా మొదలవడం కాస్త నిరాశను కలిగిస్తుంది. సరైన కేసులు .. యాలిని తన తెలివి తేటలతో వాటిని పరిష్కరించే విధానానికి సంబంధించిన ఇంట్రెస్టింగ్ ఎపిసోడ్స్ త్వరలో పలకరించవచ్చు. అలా కథ పుంజుకుంటే ఈ సిరీస్ కూడా ఒక ‘హార్ట్ బీట్’ .. ‘ ఆఫీస్’ సిరీస్ ల సరసన చేరే ఛాన్స్ ఉంది.

# మనం మరచిన చరిత్ర



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ చిత్రం ‘రణబాలి’. రాహుల్ సంకృత్యాన్ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ‘రణబాలి’ నెవర్ ఫర్ గెట్ ట్రూత్’ పేరుతో రూపొందించిన నాలుగు ఎపిసోడ్ల డాక్యుమెంటరీ సిరీస్‌లో రెండో ఎపిసోడ్ ‘ది హిస్టరీ వి ఫర్‌గాట్’ బుధవారం యూట్యూబ్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చింది. ఇందులో బ్రిటీషర్స్ ఉద్దేశ్యపూర్వకంగా దాచిన నిజాలు ఏమిటి? రైల్వేల పేరుతో మన దేశపు ధాన్యసిరులను బ్రిటీషర్స్ ఎలా తరలించుకుపోయారో ఈ రెండో ఎపిసోడ్‌లో చూపించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ ‘అప్పట్లో మనకు చరిత్ర అంటే బ్రిటీషర్స్ చెప్పిందే. మనవాళ్ల శ్రమతో బ్రిటీషర్లు వాళ్ల స్వార్థం కోసం నిర్మించుకున్నదే ఇండియన్ రైల్వేస్ అని తెలుసుకున్నా. ట్రిలియన్ డాలర్స్ విలువైన ధాన్యం, పత్తి, మసాలా దినుసులు, బంగారాన్ని ఇండియన్ రైల్వేస్ ద్వారా బ్రిటీషర్స్ తరలించారు’ అని అన్నారు. అక్టోబర్ 2న మూడో ఎపిసోడ్ ‘ది మెన్ వి ఫర్‌గాట్’ స్ట్రీమింగ్‌కు రాబోతున్నది.

## నాగార్జున సూపర్ హిట్ క్లాసిక్ రొమాంటిక్ మూవీ ‘గీతాంజలి’ రీ-రిలీజ్ డేట్ ఫిక్స్




అక్కినేని నాగార్జున కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోయిన క్లాసిక్ రొమాంటిక్ డ్రామా ‘గీతాంజలి’ రీ-రిలీజ్‌కు తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని 4ఖ డిజిటల్ వెర్షన్‌లో నవంబర్ 13న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అన్నపూర్ణ స్టూడియోస్ అధికారికంగా ప్రకటించింది. గతంలో ఈ చిత్రాన్ని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 28న విడుదల చేయాలని ప్లాన్ చేశారు. అయితే, పిక్చర్, సౌండ్ క్వాలిటీని మరింత మెరుగుపరిచేందుకు అదనపు పునరుద్ధరణ పనులు అవసరం కావడంతో విడుదల వాయిదా పడింది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న అభిమానులకు చిత్రబృందం ఇప్పుడు కొత్త తేదీతో స్పష్టత ఇచ్చింది. 1989లో విడుదలైన ‘గీతాంజలి’ అప్పట్లో ఓ సంచలనం. ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెలుగులో నేరుగా దర్శకత్వం వహించిన ఏకైక చిత్రం ఇదే కావడం విశేషం. నాగార్జున-గిరిజ ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీతో పాటు ఇళయరాజా సంగీతం, పీసీ శ్రీరామ్ సినిమాటోగ్రఫీ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. దాదాపు 37 ఏళ్ల తర్వాత ఈ క్లాసిక్ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో 4K టెక్నాలజీతో మళ్లీ పెద్ద తెరపైకి తీసుకురానున్నారు. శ్రీ పద్మిని సినిమాస్ ఈ చిత్రాన్ని పంపిణీ చేయనుంది.



## ఓటీటీకి మృణాల్ ఠాకూర్ ‘పూజా మేరీ జాన్’

ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై ఒక వైపున క్రైమ్ థ్రిల్లర్ జోనర్ కి సంబంధించిన కథలు దూసుకుపోతుంటే, మరో వైపున కోర్టు రూమ్ డ్రామాలు తమ జోరును కొనసాగిస్తున్నాయి. క్రైమ్ ను .. సస్పెన్స్ ను టచ్ చేస్తూ కోర్టు రూమ్ డ్రామాలు ఉండటం ఈ కాన్సెప్ట్ లకు కలిసొస్తుంది. బలమైన కథ .. కథనం కలిగిన కంటెంట్ కి ప్రేక్షకుల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది. నిడివి ఎక్కువగా ఉన్నప్పటికీ వాళ్లు ఈ తరహా కంటెంట్ పట్ల ఆసక్తిని కనబరుస్తున్నారు. స్త్రీ ప్రధానమైన పాత్రలతో ఈ తరహా కంటెంట్ రూపొందుతుండటం ప్రత్యేకంగా కనిపిస్తోంది. అలా స్త్రీ ప్రధానమైన రెండు పాత్రల చుట్టూ తిరిగే కథలో ఒక సినిమా రూపొందింది. ఆ సినిమా పేరే ‘పూజా మేరీ జాన్’. అక్టోబర్ 2వ తేదీ నుంచి ‘జీ 5’లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది.

ఈ సినిమాలో పూజ పాత్రను మృణాళ్ ఠాకూర్ పోషించారు. ఈ పాత్ర ను కేంద్రబిందువుగా చేసుకునే ఈ కథ నడుస్తుంది. తన స్నేహితుడు చేసిన లవ్ ప్రపోజల్ ను ఆమె సున్నితంగా తిరస్కరిస్తుంది. ఫలితంగా ఆమె ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది? అనే అంశం చుట్టూ సన్నివేశాలను అల్లుకుంటూ వెళ్లారు. ఇక ఇటీవల కాలంలో ఓటీటీ సినిమాలతో .. సిరీస్ లతో హుమా ఖురేషి ఆడియన్స్ కి మరింత చేరువయ్యారు. అలాంటి ఆమె ఈ సినిమాలో లాయర్ ‘సనా’ పాత్రను పోషించారు. పూజకి న్యాయం చేయడం కోసం పోరాడే ఒక ధైర్యవంతురాలైన లాయర్ గా ఆమె ఈ పాత్రలో కనిపించనున్నారు. ఈ రెండు పాత్రలు ఈ సినిమాకి రెండు కళ్ళుగా చెప్పుకోవలసి ఉంటుంది. నవజోత్ గులాటి దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఓటీటీ ఆడియన్స్ వైపు నుంచి ఎలాంటి రెస్పాన్స్ ను రాబట్టుకుంటుందనేది చూడాలి.

## ముంబైకి మకాం మార్చిన కల్యాణి ప్రియదర్శన్



దక్షిణాదిలో ప్రతిభావంతురాలైన నాయికగా గుర్తింపును సంపాదించుకుంది కల్యాణి ప్రియదర్శన్. ముఖ్యంగా గత ఏడాది విడుదలైన ‘లోక ఛాప్టర్-1’ చిత్రం ఆమె కెరీర్‌ను మలుపుతిప్పింది. ఈ నేపథ్యంలో ఆమె ‘ప్రళయ్’ సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నది. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా జై మెహతా దర్శకత్వంలో జాంబీ థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూనే రణ్‌వీర్‌సింగ్ సరసన నటించే లక్కీఛాన్స్‌ను దక్కించుకోవడంతో ఈ సొగసరి ఆనందానికి అవధులులేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా కోసం ఆమె లుక్, ఫిట్‌నెస్, యాక్షన్ స్కిల్స్‌పై ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నది. అందులో భాగంగా ముంబయికి మకాం మార్చి సినిమా పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలని నిర్ణయించుకుందట. ముఖ్యంగా యాక్షన్ ఘట్టాల కోసం గత మూడు నెలలుగా స్పెషల్ ట్రెయినింగ్ తీసుకుంటున్నదట. రణ్‌వీర్‌సింగ్‌తో కలిసి వర్క్‌షాప్స్, రిహార్సల్స్‌లో పాల్గొంటూ బిజీగా గడుపుతున్నదీ భామ. ఈ సినిమా ద్వారా బాలీవుడ్‌లో బ్రేక్ సాధించి ఉత్తరాదిన కూడా తన ఇమేజ్‌ను పెంచుకోవాలనే లక్ష్యంతో కల్యాణి ప్రియదర్శన్ ఉందని చెబుతున్నారు. ‘ప్రళయ్’ చిత్రం అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది.

## బిందాస్ డ్యాన్స్ హంగామా



సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘జైలర్-2’ దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. బుధవారం ఈ సినిమా నుంచి బాలీవుడ్ భామ నోరా ఫతేహీ నర్తించిన ‘బిందాస్’ అనే ఐటెంసాంగ్‌ని విడుదల చేశారు.అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన ఈ పాటకు సూపర్‌సుబ్బు లిరిక్స్ అందించారు. హుషారైన న బీట్, జోష్ పెంచే స్టెప్పులతో ఈ పాట సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. సన్‌పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం భారీ స్థాయిలో విడుదలకానుంది.

## రెండు ఓటీటీల్లోకి రవితేజ మేనల్లుడి సినిమా.. స్ట్రీమింగ్ ఎప్పటినుంచంటే?




మాస్ మహారాజా రవితేజ కుటుంబం నుంచి హీరోగా పరిచయమైన మాధవ్ భూపతిరాజు నటించిన ‘మారెమ్మ’ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. రూరల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 10న థియేటర్లలో విడుదలైంది. థియేటర్లలో ఆశించిన స్థాయిలో స్పందన అందుకోలేకపోయిన ఈ సినిమా.. ఇప్పుడు డిజిటల్ వేదికలపై తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ‘మారెమ్మ’ సినిమా ఒక్క ఓటీటీకే పరిమితం కాకుండా రెండు ప్రముఖ డిజిటల్ వేదికల్లో అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. తెలుగు ఓటీటీ వేదిక ఆహాతో పాటు అమెజాన్ ప్రైమ్ వీడియోలోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. అక్టోబర్ 9 నుంచి రెండు వేదికల్లోనూ సినిమా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో ‘మారెమ్మ’ను తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే ఓటీటీ విడుదలకు సంబంధించిన అధికారిక వివరాలను వెల్లడించే అవకాశం ఉంది.మాధవ్ భూపతిరాజు హీరోగా పరిచయమైన ‘మారెమ్మ’పై రవితేజ అభిమానుల్లో కొంత ఆసక్తి నెలకొంది. అయితే థియేటర్లలో విడుదలైన తర్వాత సినిమాకు మిశ్రమ స్పందన రావడంతో ఆశించిన స్థాయిలో వసూళ్లు సాధించలేకపోయింది. ఇప్పుడు ఓటీటీ విడుదల నేపథ్యంలో సినిమాకు ఎలాంటి స్పందన వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ‘మారెమ్మ’కు మంచాల నాగరాజ్ దర్శకత్వం వహించారు. మయూర్ రెడ్డి బండారు ఈ చిత్రాన్ని నిర్మించారు. మాధవ్ భూపతిరాజు సరసన దీపా బాలు కథానాయికగా నటించగా, వికాస్ వశిష్ఠ ప్రతినాయకుడి పాత్రలో కనిపించారు. వినోద్ కుమార్, వీఎస్ రూప లక్ష్మి, దయానంద్ రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ప్రశాంత్ ఆర్ విహారి, విప్రదీప్ దత్తా సంగీతం అందించారు. గ్రామీణ నేపథ్యంలోని కథతో తెరకెక్కిన ‘మారెమ్మ’ థియేటర్లలో ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినప్పటికీ.. ఇప్పుడు రెండు ఓటీటీ వేదికల్లో విడుదల కానుండటంతో డిజిటల్ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

## ఇంత భిన్నమైన అభిప్రాయాలు వస్తాయని ఊహించలేదు..

**- ‘ది ప్యారడైజ్’ రిజల్ట్‌పై నాని ఆసక్తికర వ్యాఖ్యలు**



నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన ‘ది ప్యారడైజ్’కు ప్రేక్షకుల నుంచి భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. సినిమా నచ్చిందని కొందరు చెబుతుండగా.. మరికొందరు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాని స్పందించారు. తన 18 ఏళ్ల కెరీర్‌లో 33 సినిమాలు చేసినా.. ఇలాంటి భిన్నమైన స్పందనను తొలిసారి చూస్తున్నానని చెప్పారు. సినిమాపై విమర్శలు వచ్చినా వాటిలో కనిపిస్తున్న తీవ్రతను తాము సానుకూలంగానే తీసుకున్నామని నాని తెలిపారు. సినిమా నచ్చలేదని ఎవరైనా బలంగా చెబితే.. అది కూడా ప్రేక్షకుల స్పందనేనని పేర్కొన్నారు. ‘ది ప్యారడైజ్’కు తీవ్ర స్థాయిలో స్పందనలు రావొచ్చని ముందే తెలుసని నాని చెప్పారు. అయితే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంత భిన్నమైన అభిప్రాయాలు వస్తాయని ఊహించలేదన్నారు. ఇది తనకు ఒక కొత్త అనుభవమని చెప్పారు. మరోవైపు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కూడా స్పందించారు. సినిమాకు వస్తున్న మిశ్రమ స్పందనను ఇంకా పూర్తిగా అర్థం చేసుకోలేకపోతున్నానని తెలిపారు. మరికొంత సమయం తీసుకుని ప్రేక్షకుల స్పందనను అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. ఇదే విషయంపై నాని, సినిమా విడుదలైన మరుసటి రోజే సోషల్ మీడియాలో స్పందించారు. ప్రేక్షకుల ప్రేమతో పాటు, ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నానని చెప్పారు. సినిమా బాగోలేదని విమర్శకులు చెప్పిన అంశాల నుంచి కూడా నేర్చుకున్నానని తెలిపారు. ప్రేక్షకుల కోసం ఎంతో కష్టపడి ప్రత్యేకమైన అనుభవాన్ని అందించేందుకు సినిమా చేశామని పేర్కొన్నారు.దసెప్టెంబర్ 24న విడుదలైన ‘ది ప్యారడైజ్’లో మోహన్ బాబు, కయాదు లోహర్, రాఘవ్ జుయల్ కీలక పాత్రల్లో నటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమా రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరిపోయింది.

## గ్రామ స్థాయిలో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్

# కమిటి ఏర్పాటు చేయాలి

### పిల్లల పై జరిగే నేరాలు అరికట్టవచ్చు అత్తోట పోతురాజు




శ్రీశైలం (ప్రశ్నన్యూస్) తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామంలో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటి ఏర్పాటు చేయటం జరిగింది.గ్రామంలో ఉన్న ఎ.పి.జె.అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ వారికి అండగా 1-10-2026 శుక్రవారం ఈకమిటీ ఏర్పాటు చేయటం జరిగినది.గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీ నుద్దేశించి అత్తోట పోతురాజు మాట్లాడుతూ గ్రామాల్లో బాలల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసే ఈ విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటి ప్రధానంగా పిల్లల రక్షణ,భద్రత, సంక్షేమం కోసం పనిచేస్తుందని గ్రామ బాలల పరిరక్షణ కమిటీ ముఖ్యంగా గ్రామంలో బాలకార్మికులు లేకుండా చూడటం,అలాగే బాల్య వివాహాలు జరగకుండా అడ్డుకోవడం,తల్లిదండ్రులకు, గ్రామస్థులకు పిల్లల హక్కులు, చదువు ప్రాముఖ్యత మరియు హింస వ్యతిరేక చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం,బడి మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించడం,లైంగిక వేధింపులు లేదా హింసకు గురవుతున్న పిల్లలను గుర్తించి రక్షించడం, గ్రామంలో ఏవైనా బాలల హక్కుల ఉల్లంఘనలు జరిగితే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 గాని,స్థానిక పోలీసులకు లేదా జిల్లా బాలల పరిరక్షణ యూనిట్ కు సమాచారం ఇవ్వడం,గ్రామంలో ఆపదలో ఉన్న,అనాథ లేదా నిరుపేద పిల్లలను గుర్తించి,ప్రభుత్వ పథకాలు వారికి అందేలా సమన్వయం చేయడం,గ్రామ స్థాయిలో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి,పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు వెతకడం పిల్లలు గుర్తించిన సమస్యలు గురించి అధికారులకు వినతిపత్రం అందించటం లాంటివి చేయాలని తెలిపారు.ఈకార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సిబ్బంది అత్తోట పోతురాజు ఎ.పి.జె.అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్ సభ్యులు విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొట్యాలలో వాణిజ్య, గృహ వినియోగ పండ్ల తోట నమూనా ప్రారంభం

### రైతులకు అదనపు ఆదాయం, కుటుంబాలకు పోషకాహార భద్రతే లక్ష్యం



గజ్వేల్ (ప్రశ్న న్యూస్)రైతులకు అదనపు ఆదాయం, కుటుంబాలకు పోషకాహార భద్రతతో పాటు సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొట్యాల గ్రామంలో వాణిజ్య, గృహ వినియోగ పండ్ల తోట నమూనాను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ అదనపు కలెక్టర్ మంద రవీందర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ నమూనా తోటను శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.మంద రవీందర్‌రెడ్డికి చెందిన 9 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో 2 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలను అభివృద్ధి చేస్తున్నారు. మహీధర రైతు ఉత్పత్తిదారుల సంస్థ విజ్ఞప్తి మేరకు ఉద్యాన విశ్వవిద్యాలయ నిపుణులు తోటకు శాస్త్రీయ లేఅవుట్ రూపొందించి సాంకేతిక సహకారం అందించారు.రెండు ఎకరాల్లో విభిన్న పండ్ల తోట శాస్త్రీయ లేఅవుట్ ప్రకారం ఒక ఎకరంలో 14 రకాల మామిడి రకాలకు చెందిన 140 మొక్కలను, మరో ఎకరంలో 214 మిశ్రమ పండ్లతో పాటు ఉపయోగకరమైన మొక్కలను ఏర్పాటు చేస్తున్నారు. ఏడాది పొడవునా వివిధ రకాల పండ్లు అందుబాటులో ఉండేలా ఈ తోట నమూనాను రూపొందించారు.మామిడి తోటలో బంగినపల్లి, దశేరి, హిమాయత్, కేసర్, రాయల్ స్పెషల్, మల్లిక, చిన్నరసం, పెద్దరసం, జలాల్, పునాస, కొత్తపల్లి కొబ్బరి, పాండూరి, నీలం, అల్ఫాన్సో తదితర రకాలను నాటారు.మిశ్రమ పండ్ల తోటలో కొబ్బరి, సపోటా, జామ, నిమ్మ, మునగ, చింత, అరటి, పనస, నేరేడు, అంజీర్, యాపిల్ బేర్, కరివేపాకు, ఉసిరి, దానిమ్మ, స్టార్‌ఫ్రూట్, లిచ్చి తదితర మొక్కలను చేర్చారు. ప్యాకింగ్ అవసరాలకు ఉపయోగపడే అరటి ఆకులు కూడా అందుబాటులో ఉండేలా తోటను రూపొందించారు. స్థానికంగా, కాలానుగుణంగా, దేశీయంగా లభించే వివిధ రకాల పండ్లను ఒకే తోటలో పెంచడం ద్వారా కుటుంబాలకు ఏడాది పొడవునా పండ్ల లభ్యత పెరగడంతో పాటు రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కలుగుతాయని నిర్వాహకులు తెలిపారు.పండ్ల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి, పోషకాహార భద్రత, రైతుల ఆదాయ వృద్ధి, జీవ వైవిధ్యం, సుస్థిర వ్యవసాయ విధానాల ప్రోత్సాహంలో ఇలాంటి నమూనా తోటలు కీలకంగా ఉంటాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఏ. భగవాన్, ఉద్యానశాఖ డీన్, విద్యార్థి వ్యవహారాల డీన్ డా. జె. చీనా, పరిశోధనా విభాగం సంచాలకులు డా. డి. లక్ష్మీనారాయణ, పరీక్షల నియంత్రణాధికారి, అంతర్జాతీయ కార్యక్రమాల సంచాలకులు డా. ఎన్. శ్రీనివాసన్, పీజీఐహెచ్ఎస్ ఇన్‌చార్జి డా. డి. విజయ, అసోసియేట్ డీన్ డా. పి. ప్రశాంత్, పాలక మండలి సభ్యులు పంకజ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఉప సర్పంచ్ హరివర్ధన్ రెడ్డి, వి. దేవి రెడ్డి, ఎ. కమలాకర్ రెడ్డి, అనంత రెడ్డి, అల్లినగర్ సిబ్బంది, పీజీ కళాశాల బోధనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.మహీధర రైతు ఉత్పత్తిదారుల సంస్థ డైరెక్టర్ రవీంధర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. రైతులకు శాస్త్రీయ, సాంకేతిక మార్గదర్శకత్వం అందిస్తూ ఇలాంటి నమూనా తోటలను విస్తృతంగా ప్రోత్సహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి

### ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా పనులు నిలిపివేయడం సరికాదు

### ఆర్అండ్‌బీ అధికారిని కలిసిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోతుగంటి నరేందర్




కల్వకుర్తి (ప్రశ్న న్యూస్) రామగిరి-రఘుపతిపేట బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కంటెస్టెడ్ జెడ్పిటిసి పోతుగంటి నరేందర్ డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోవడానికి గల కారణాలను తెలుసుకునేందుకు పోతుగంటి నరేందర్ గురువారం ఆర్అండ్‌బీ డిపార్ట్‌మెంట్ డిస్ట్రిక్ట్ హెడ్ ఆఫీసర్ శ్రీధర్ను జిల్లా కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్రస్తుత పరిస్థితి, పనుల పురోగతి, పనులు నిలిచిపోవడానికి గల కారణాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఫోటోలు, వీడియో విజువల్స్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలపై ఆధారపడాల్సి వస్తోందని వివరించారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులను ఇక ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని నరేందర్ కోరారు.

**ఆర్‌టీఐ దరఖాస్తు చేశా..**

బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం తాను ఇప్పటికే సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశానని నరేందర్ తెలిపారు. పనుల మంజూరు, అంచనా వ్యయం, ఇప్పటివరకు జరిగిన పనులు, చెల్లింపులు, పనులు నిలిచిపోవడానికి కారణాలు తదితర వివరాలను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని ఆర్అండ్‌బీ అధికారి శ్రీధర్‌ను కోరారు.ప్రజల సౌకర్యం, రవాణా అవసరాల కోసం చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను అధికారులు బాధ్యతాయుతంగా పర్యవేక్షించి వేగవంతం చేయాలని నరేందర్ స్పష్టం చేశారు. పనులు త్వరగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు.

## గాంధీ జయంతి సందర్భంగా

## ఘనంగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం

### - ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహాం



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్) గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్లు-1, 2 ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.గాంధీజీ బోధించిన సత్యం, అహింస, సేవ, పరిశుభ్రత, సామాజిక బాధ్యత వంటి విలువలను జీవితంలో ఆచరిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం 'స్వచ్ఛతాహీ సేవ' కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. స్వచ్ఛత అనేది ఒకరోజు కార్యక్రమం కాదని, ప్రతిరోజూ పాటించాల్సిన సామాజిక బాధ్యత అని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహాం మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ కలలుగన్న పరిశుభ్రమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. విద్యార్థులు కళాశాల, ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సమాజంలోనూ స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని సూచించారు."నేను మారుతాను - నా పరిసరాలను మారుస్తాను" అనే భావనను ప్రతి విద్యార్థిలో పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని ప్రోగ్రామ్ ఆఫీసర్లు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తమ పరిసరాల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడే బాధ్యతాయుతమైన యువతగా ఎదగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కళాశాల బోధనా సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాత్మా గాంధీజీకి ఘన నివాళులు అర్పించారు. "స్వచ్ఛతాహీ సేవ - పరిశుభ్రమైన పరిసరాలు ప్రతి ఒక్కరి బాధ్యత" అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

# పోక్సో కేసులో నిందితుడికి

# ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

### రూ.3 వేల జరిమానా.. బాధితురాలికి రూ.50 వేల పరిహారం



జవహర్‌నగర్ (ప్రశ్న న్యూస్) పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మేడ్చల్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన కేసులో నిందితుడు జొరిల్ల వెంకటయ్యకు ఈ శిక్ష పడింది.పోలీసుల వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 383/2019గా ఐపీసీ సెక్షన్ 354, పోక్సో చట్టం-2012లోని సెక్షన్ 12 కింద కేసు నమోదైంది.కేసును విచారించిన మేడ్చల్ జిల్లా రేప్, పో క్సో కేసుల త్వరితగతిన విచారణ, పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం నిందితుడు జొరిల్ల వెంకటయ్య (55) దోషిగా నిర్ధారించింది. దీంతో అతడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.3,000 జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.50,000 పరిహారం అందజేయాలని న్యాయస్థానం ఆదేశించింది.ఈ కేసులో జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్. సైదులు దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. ప్రభాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. కేసు విచారణలో కోర్టు డ్యూటీ సిబ్బంది, సమన్ల సిబ్బంది, లైజాన్ అధికారి, మానిటరింగ్ అధికారి తదితరులు సమన్వయంతో వ్యవహరించారు.పోక్సో కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించి, న్యాయస్థానంలో పటిష్టమైన ఆధారాలను సమర్పించినట్లు పోలీసులు తెలిపారు. తీర్పు నేపథ్యంలో జవహర్‌నగర్ పోలీస్ అధికారులు, సిబ్బంది కేసు దర్యాప్తు మరియు ప్రాసిక్యూషన్‌కు సహకరించిన వారిని అభినందించారు.

## ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ హక్కుల్లో

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై మూట్ కోర్ట్ పోటీ




మేడ్చల్ (ప్రశ్న న్యూస్)ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ హక్కుల రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, దాని ద్వారా ఉత్పన్నమవుతున్న న్యాయపరమైన సవాళ్లపై కూకట్ పల్లి లోని అనంత లా కాలేజీ,లో 5 అంతర్గత మూట్ కోర్ట్ పోటీని ఘనంగా నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ ఐపీఆర్ అనే సమకాలీన అంశంపై నిర్వహించిన ఈ పోటీలో కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ న్యాయ పరిజ్ఞానం, పరిశోధనా సామర్థ్యం, వాదనా పటిమను ప్రదర్శించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.వి. చంద్రమతి కరస్పాండెంట్ డా. రవి అనంత మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థుల్లో న్యాయపరమైన ఆలోచనా విధానాన్ని, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు విద్యా సంబంధ కార్యక్రమాలకు వారు అందిస్తున్న నిరంతర సహకారం ప్రశంసనీయం.

ఈ కార్యక్రమానికి న్యాయశాస్త్ర విభాగం గౌరవ డీన్ ప్రొఫెసర్ డా. ఎన్. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవతా విలువలు చట్టపరమైన నిబంధనల కంటే అత్యున్నతమైనవని పేర్కొన్నారు.న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో సాంకేతిక మార్పులకు అనుగుణంగా న్యాయ విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.న్యాయ వృత్తి, న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తీసుకువస్తున్న మార్పులను ఆయన వివరించారు. అలాగే, మూట్ కోర్ట్ పోటీ కోసం రూపొందించిన మూట్ ప్రపోజిషన్ ప్రత్యేకమైనదిగా, చక్కగా రూపొందించబడిందని ఆయన అభిప్రాయపడ్డారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.వి. చంద్రమతి పోటీలో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్‌లో బాధ్యతాయుతమైన, సమర్థవంతమైన న్యాయ నిపుణులుగా ఎదగడానికి విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.కరస్పాండెంట్ డాక్టర్ అనంత రవి నిర్వాహకులను, విద్యార్థులను అభినందిస్తూ, విద్యార్థులకు ప్రాయోగిక న్యాయ శిక్షణ అందించడంలో కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. విద్యార్థుల్లో న్యాయపరమైన పరిశోధన, వాదనా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ పోటీలో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ హక్కులు, న్యాయపరమైన ఉల్లేఖనలు, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలు వంటి సమకాలీన న్యాయ అంశాలపై విద్యార్థులు తమ వాదనలను సమర్థవంతంగా వినిపించారు.మొత్తం 38 జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. పోటీ ముగింపు సందర్భంగా నిర్వహించిన ఘనమైన ముగింపు కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

# ప్రజ్ఞాపూర్‌కు గర్వకారణం..

## దర్శకుడు బి. నర్సింగరావుకు గౌరవ డాక్టరేట్

### - బండారు రామ్మోహనరావు





గజ్వేల్( ప్రశ్న న్యూస్)అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖ దర్శకుడు బి. నర్సింగరావుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం ప్రజ్ఞాపూర్ గ్రామానికి గర్వకారణమని మాజీ సర్పంచ్ బండారు రామ్మోహనరావు అన్నారు.'మా భూమి', 'దాసి', 'రంగుల కల', 'హరివిల్లు', 'మనుషులు' తదితర విప్లవాత్మక, కళాత్మక చిత్రాలను రూపొందించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బి. నర్సింగరావుకు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.ప్రజ్ఞాపూర్ గ్రామంలో పుట్టి పెరిగిన బి. నర్సింగరావు ఐదో తరగతి వరకు ఇక్కడే విద్యాభ్యాసం చేశారని రామ్మోహనరావు తెలిపారు. తన ప్రతిభ, సృజనాత్మకతతో అనేక అంతర్జాతీయ అవార్డులు అందుకున్న ఆయనకు అంబేద్కర్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం ప్రజ్ఞాపూర్ గ్రామానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చిందన్నారు.ప్రజ్ఞాపూర్ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి సినీ రంగంలో తనదైన ముద్ర వేసిన బి. నర్సింగరావుకు గౌరవ డాక్టరేట్ దక్కడం గ్రామ యువతకు స్ఫూర్తిదాయకమని బండారు రామ్మోహనరావు పేర్కొన్నారు.

# జగిత్యాల జిల్లాలో

# పోలీస్ యాక్ట్ 1861 అమలు

### - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




జగిత్యాల(ప్రశ్న న్యూస్) శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (అక్టోబర్ 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

# ఎమ్మార్వో సంతకం ఫోర్జరీ.?

## 50 కోట్ల భూమికి రెక్కలు.?

-కోట్ల విలువైన భూమి ల్యాండ్ బ్యాంకు నుంచి ప్రైవేట్ వ్యక్తుల ఖాతాలోకి వెళ్లడం,రెవిన్యూ యంత్రాంగం ఎం చేస్తుంది.? నిలదీస్తున్న ప్రజానీకం.

- దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా గుర్తింపు పొంది మొన్న ఈ మధ్య కోకాపేట ప్రాంతంలో ఎకరం భూమి వందల కోట్ల రూపాయలు పలకడం అందరికి తెలిసిందే.

- రోజు రోజుకి నగరం నదిబొడ్డున భూమి విలువలు ఆకాశం తాకుతున్న నేపథ్యంలో ప్రైవేట్ స్థలాలు కరువై సర్కార్ భూమి పై కన్నేస్తున్న కన్నీగాండ్లు.

- ఆదిభట్ల ప్రాంతంలో 4.36 ఎకరాల భూమి పరాయపాలు కావడానికి కారణం సొంతవాళ్ళే అని విశ్వసనీయ సమాచారం .

**కోట్ల విలువైన ప్రభుత్వ భూములపై ల్యాండ్ మాఫియా కన్ను, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లి గ్రామా రెవిన్యూ పరిధిలో సర్వే నెంబర్ 96 లో 4.36 ఎకరాల భూమి దొంగల ఖాతాలోకి! రెవిన్యూ అధికారులకు తెలియకుండా 50 ఎకరాల భూమి అస్మదీయుల హస్తగతం కావడం ప్రజలను ఆశ్చర్య పరుస్తోంది.**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశంలో ఉన్న 29 రాష్ట్రాలలో మెట్రోపాలిటన్ నగరాలలో నెంబర్ వన్ స్థానంలో ఉన్నది హైదరాబాద్. దేశమేకాదు ప్రపంచ దేశాలు కూడా తెలంగాణ వైపు చూస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రపంచస్థాయిలో వివిధ కంపెనీలు తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి క్యూ కడుతున్న విషయం తెలిసిందే.మొన్న ఈ మధ్య పేరుగాంచిన ఓ ప్రముఖ కంపెనీ





కోకాపేటలో ఎకరం భూమి వందల కోట్ల రూపాయలకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. (ఎకరం150.25 కోట్లతో రికార్డు బద్దలు). ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిభట్లలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగుళ్ఫూర్ గ్రామం రెవిన్యూ పరిధిలోని బొంగ్లూర్ విశ్వేశ్వరయ్య కళాశాల వెనుక వైపు ఉన్న సర్వే నెంబర్ 96 లో 4.36 ఎకరాల 50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఉన్నట్లు సమాచారం,4.25 ఎకరాలు భూమి "వహీదా బేగం" పేరుతో పట్టా పాసుపుస్తకం జారీ అయినట్లు తెలుస్తోంది.ఈ భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.50 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా.

### - ప్రభుత్వ భూమికి పట్టా ఎలా.?

సర్వే నంబర్ 96 లోని భూమి ప్రభుత్వ భూమిగా ఉన్న దానిలో ప్రైవేటు వ్యక్తి పేరుపై పట్టాగా మారడం వెనుక అసలు ప్రక్రియ ఏమిటన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. సాధారణంగా భూమి స్వభావం,హక్కులు,పాత రెవెన్యూ రికార్డులు, వారసత్వం, కబ్జా, ప్రభుత్వ ఉత్తర్వులు తదితర అంశాలను పరిశీలించిన తర్వాతే భూ రికార్డుల్లో మార్పులు జరుగుతాయి. అలాంటప్పుడు ప్రభుత్వ భూమికి పట్టా పాసుపుస్తకం జారీ కావడానికి ఏ ఆధారం చూపించారన్నది అధికారులు చేర్చాల్సిన పని ఉంది,ఫోర్జరీ

### - సంతకంతోనే మార్పులా.?

ఈ వ్యవహారంలో తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా మార్చి,తహసీల్దార్ సంతకం తమది కాదని,తమ ప్రమేయం లేకుండానే సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు చెబుతున్ననేపథ్యంలో సంబంధిత పట్టా ఫైల్, ఆమోద ఉత్తర్వులు, నోట్ఫైల్,రికార్డు మార్పుల వివరాలు,డిజిటల్ ఎంట్రీలు వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### - రికార్డుల్లో ఎక్కడ మార్పు జరిగింది.?

ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తి పేరుపైకి మారిందంటే కేవలం పట్టా పాసుపుస్తకం జారీతోనే ఆ ప్రక్రియ పూర్తయిందా? లేక అంతకుముందే రెవెన్యూ రికార్డుల్లో భూమి స్వభావానికి సంబంధించిన మార్పులు జరిగాయా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.పాత పహాణీలు, సెత్వార్, 1-బి, ఆర్ఓఆర్ రికార్డులు, ధరణి/ప్రస్తుత భూ రికార్డుల్లోని వివరాలు, మ్యుటేషన్ చరిత్ర,పట్టా పాసుపుస్తకం జారీకి సంబంధించిన ఫైళ్లను పోల్చి పరిశీలిస్తే మార్పులు ఎప్పుడు, ఎవరి ఆదేశాలతో జరిగాయనే విషయం స్పష్టమయ్యే అవకాశం ఉంది.

### - ఎవరి ప్రమేయం ఉంది.?

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ అయిందనే ఆరోపణ నిజమైతే..ఆ సంతకం ఉన్న పత్రం ఎక్కడ తయారైంది? దాని ఆధారంగా రికార్డుల్లో మార్పులు చేసిన వారు ఎవరు?పట్టా పాసుపుస్తకం జారీ ప్రక్రియలో ఏయే అధికారులు లేదా సిబ్బంది ఫైల్ను పరిశీలించారు? సంబంధిత డిజిటల్ ఎంట్రీలు ఎవరి లాగిన్ ద్వారా జరిగాయి? అనే అంశాలు కీలకంగా మారనున్నాయి.ఈ వివరాలను వెలికితీసేందుకు శాఖాపరమైన విచారణతో పాటు అవసరమైతే సంతకాల నిపుణుల పరిశీలన,రికార్డుల ఫోరెన్సిక్ వెరిఫికేషన్ కూడా ఉపయోగపడే అవకాశం ఉంది.

### - విచారణలో తేలాల్సిన కీలక అంశాలు:

ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగితే ప్రధానంగా పలు అంశాలకు సమాధానాలు లభించే అవకాశం ఉంది.సర్వే నంబర్ 96లో భూమి వాస్తవ స్వభావం ఏమిటి? 4.25 ఎకరాలు"వహీదా బేగం" పేరుపై ఏ ప్రాతిపదికన నమోదు అయ్యాయి? పట్టా పాసుపుస్తకం జారీకి సమర్పించిన పత్రాలు ఏమిటి?సంబంధిత పత్రాలపై ఉన్న తహసీల్దార్ సంతకం నిజమైనదేనా? రికార్డుల్లో మార్పులు చేసిన తేదీ, అధికారి లేదా సిబ్బంది వివరాలు ఏమిటి? అనే అంశాలను అధికారులు తేల్చాల్సి ఉంది.ఈ వ్యవహారంలో సొంత వాళ్ళైనా బయట వారైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఏంత్రాంగం ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.?

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కు కొత్త బాస్

### - ఎండీ, సీఈవోగా అనుప్ బగ్చీ నియామకం




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీకి నూతన సారథి రానున్నారు. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా అనుప్ బగ్చీని నియమిస్తున్నట్లు బ్యాంక్ బోర్డు ప్రకటించింది. ప్రస్తుత ఎండీ, సీఈవో శశిధర్ జగదీశన్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అనుప్ బగ్చీ నియామకంతో పాటు ఆయన వేతన ప్యాకేజీకి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అక్టోబర్ 1న ఆమోదం తెలిపింది. ఆయన 2026 అక్టోబర్ 27 నుంచి మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. బగ్చీ పదవీకాలం 2029 అక్టోబర్ 26న ముగుస్తుంది. ప్రస్తుత సీఈవో శశిధర్ జగదీశన్ పదవీకాలం 2026 అక్టోబర్ 26తో ముగియనున్న నేపథ్యంలో ఈ నియామకం ఖరారైంది. ఐఐటీ కాన్పూర్, ఐఐఎం బెంగళూరు పూర్వ విద్యార్థి అయిన అనుప్ బగ్చీకి బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. గతంలో ఆయన ఐసీఐసీఐ గ్రూప్‌లో పలు కీలక పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవోగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఎండీ, సీఈవోగానూ ఆయన సేవలందించారు. బ్యాంకింగ్ రంగంలో అపార అనుభవం కలిగిన బగ్చీ నాయకత్వంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరింత పురోగతి సాధిస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## వరుసగా నాలుగో రోజూ నష్టాలే

### - 22,450 దిగువకు చేరిన నిఫ్టీ




ముంబై (ప్రశ్న న్యూస్) దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజు నష్టాల్లో ముగిసింది. ఇంధన ధరలు పెరగడం, బాండ్ ఈల్డ్స్‌లో హెచ్చుతగ్గులు, వడ్డీ రేట్లు మరింత పెరిగే అవకాశాలపై ఆందోళనలతో గురువారం సూచీలు భారీగా పడిపోయాయి. సెన్సెక్స్ 570.59 పాయింట్లు కోల్పోయి 71,909.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 198.50 పాయింట్లు నష్టపోయి 22,421.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీకి 22,400 స్థాయి కీలక మద్దతుగా మారిందని నిపుణులు తెలిపారు. ఇది కూడా నిలవకపోతే నిఫ్టీ 22,200-22,000 వరకు పడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. 22,600-22,800 స్థాయి తక్షణ నిరోధంగా మారిందని చెప్పారు. ఇంధన ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి.

అంతర్జాతీయ బాండ్ మార్కెట్లలో మార్పులు కూడా మదుపరులను అప్రమత్తం చేశాయి. దీంతో పలు రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. నిఫ్టీలో బజాజ్ ఆటో, మారుతి సుజుకి ఇండియా, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఆటో, ఆర్థిక రంగ షేర్లపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.01 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.97 శాతం చొప్పున పడిపోయాయి. ఆటోమొబైల్, మీడియా, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాలు ఎక్కువగా నష్టపోయాయి. ఐటీ షేర్లు మాత్రం మార్కెట్‌కు కొంత మద్దతుగా నిలిచాయి.

# 44వ జాతీయ రహదారిపై అధికారుల ఘోర నిర్లక్ష్యం

- మురుగునీటి గుంతలో చిన్నారుల స్నానాలు
- పట్టించుకోని ఎన్‌హెచ్ఏఐ యంత్రాంగం, రోడ్డు విస్తరణ పనుల్లో భద్రత గాలికి
- చిన్నారుల ప్రాణాలతో చెలగాటం.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది.?




మేడ్చల్ (ప్రశ్న న్యూస్)44వ జాతీయ రహదారిపై రోడ్డు విస్తరణ పనుల పేరుతో తవ్విన భారీ గుంతలు ప్రస్తుతం చిన్నారుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. ప్రధాన రహదారి పక్కనే ప్రమాదకరంగా తవ్విన గుంతల్లో మురుగునీరు నిలిచిపోయినా, వాటి చుట్టూ కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని వాహనదారుల అగ్రహారం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం ఇద్దరు చిన్నారులు ఈ మురుగునీటి గుంతలోకి దిగి స్నానం చేస్తూ కనిపించిన ఘటన స్థానికులు, ప్రయాణికులను ఆందోళనకు గురిచేసింది. జాతీయ రహదారి పక్కనే వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్న పరిస్థితుల్లో ఇలాంటి గుంతలను ఎలాంటి రక్షణ లేకుండా వదిలేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వాహనదారులు, పాదచారుల భద్రత కోసం బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ మార్కర్లు, రాత్రివేళ కనిపించే లైట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కానీ ఇక్కడ మాత్రం గుంతలను అలాగే వదిలేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత.?

ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న గుంతలో చిన్నారులు స్నానం చేసే స్థాయికి పరిస్థితి చేరుకోవడం అధికారుల పర్యవేక్షణపై అనేక అనుమానాలకు తావిస్తోంది. పగలు మాత్రమే కాదు, రాత్రివేళ కూడా ఈ ప్రాంతం ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. వెలుతురు సరిగా లేకపోవడం, హెచ్చరిక బోర్డులు లేకపోవడం, రక్షణ కంచెలు ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహనదారులు లేదా పాదచారులు గుంతలో పడే ప్రమాదం లేకపోలేదు.ఒకవేళ చిన్నారి ప్రమాదవశాత్తు లోతైన నీటిలో మునిగినా, వాహనం అదుపుతప్పి గుంతలో పడినా అప్పటి పరిస్థితికి బాధ్యత ఎవరు వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందే అధికారులు మేల్కొని ప్రమాద నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వాహనదారులు హెచ్చరిస్తున్నారు.

### మురుగునీటితో ఆరోగ్యానికి ముప్పు

రోజుల తరబడి నిలిచిపోయిన మురుగునీటిలో దోమలు, క్రిమికీటకాలు వృద్ధి చెందే అవకాశం ఉంది. కలుషిత నీటిలో చిన్నారులు స్నానం చేయడం వల్ల చర్మ ఇన్ఫెక్షన్లు, కళ్ల సమస్యలు, జీర్ణ సంబంధిత ఇబ్బందులు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీటిలో కనిపించని మలినాలు, రసాయనాలు లేదా ఇతర కాలుష్య పదార్థాలు ఉంటే ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉంది.అంతేకాకుండా గుంత సమీపంలో విద్యుత్ స్తంభాలు, కేబుళ్లు లేదా ఇతర విద్యుత్ లైన్లు ఉంటే నీటిలోకి విద్యుత్ ప్రవాహం చేరే ప్రమాదాన్ని కూడా అధికారులు నిర్లక్ష్యం చేయకూడదు. చిన్నారులకు ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా తక్షణమే ఆ ప్రాంతాన్ని పూర్తిగా భద్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

### పనులపై పర్యవేక్షణ ఏదీ.?

రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ సంస్థలు భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నాయా లేదా అన్నది సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే 44వ జాతీయ రహదారిపై పరిస్థితులు చూస్తుంటే పర్యవేక్షణ వ్యవస్థ ఎంతవరకు పనిచేస్తోందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికైన ఎన్‌హెచ్ఏఐ అధికారులు, సంబంధిత కాంట్రాక్ట్ సంస్థలు తక్షణమే స్పందించి గుంతల చుట్టూ పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు, రాత్రివేళ రిఫ్లెక్టర్లు, తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలి. నిలిచిపోయిన మురుగునీటిని తొలగించి, చిన్నారులు గుంతల్లోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలి.ప్రమాదం జరిగిన తర్వాత బాధితులకు పరిహారం ఇవ్వడం కంటే, ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే అధికారుల అసలు బాధ్యత. 44వ జాతీయ రహదారిపై ఇప్పటికైన అధికారులు కళ్లు తెరుస్తారా.? లేక మరో ప్రమాదం జరిగే వరకు మౌనం వహిస్తారా.? అన్నది వేచి చూడాలి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588